# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 20-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 84 పేజీలు:6 వెల: రూ.1/-


## ఇండియన్ రేసింగ్ లీగ్‌ను ప్రారంభించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 19: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఇండియన్ రేసింగ్ లీగ్ ప్రారంభమైంది. హుస్సేన్‌సాగర్ నెక్లెస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన 2.7 కిలోమీటర్ల ప్రత్యేక ట్రాక్‌లో గంటకు 300 కిలోమీటర్ల వేగంతో కార్లు దూసుకెళ్లాయి.


భారత్‌లో నిర్వహిస్తున్న తొలి స్ట్రీట్ సర్క్యూట్ కాగా.. ఇందులో హైదరాబాద్‌లో జరుగుతుండడం విశేషం. రేస్‌లో మొత్తం 24 మంది జాతీయ, అంతర్జాతీయ రేసర్లు పాల్గొనగా.. హెచ్‌ఎండీఏ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శనివారం జెండా ఊపి లీగ్‌ను ప్రారంభించారు. అనంతరం లీగ్‌ను వీక్షించారు. పెద్ద సంఖ్యలో జనం హాజరై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లిన కార్లను చూసి కేరింతలు కొట్టారు.

## దలైలామాకు గాంధీ మండేలా అవార్డు



ధర్మశాల నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టిబెట్ మత గురువు దలైలామాకు ఇవాళ గాంధీ మండేలా అవార్డును అందజేశారు. 2019 సంవత్సరానికి గాను ఆయన్ను ఈ అవార్డు వరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో గాంధీ మండేలా ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ చేతులు మీదుగా ఈ అవార్డు ఇచ్చారు.

## సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు వరంగల్ జిల్లా వాసుల మృతి



అమరావతి నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. వరంగల్‌కు చెందిన ఓ కుటుంబం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో వస్తుండగా సత్యసాయి జిల్లాలోని కనగానపల్లె మండలం పర్వతదేవరపల్లి వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు దంపతులతో సహ మరొకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంపీ అర్వింద్‌పై చర్యలు తీసుకోవాలి.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

**-ఎంపీ అర్వింద్‌పై చర్యలు తీసుకోవాలి.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు**

హైదరాబాద్, నవంబర్ 19: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ మహిళా విభాగం నేతలు మహిళా కమిషన్‌తో పాటు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఎంపీ మహిళ పట్ల అభ్యంతరక వ్యాఖ్యలు చేశారని టీఆర్ఎస్ మహిళా నాయకులు ముక్తవరం సుశీలా రెడ్డి ఫిర్యాదులో ఆరోపించారు.

ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిటి సివిల్ కోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాలను ధిక్కరించి అసభ్యంగా, అభ్యంతరంగా, అవమానించే విధంగా మాట్లాడారన్నారు. గతంలోనూ ఎంపీ అరవింద్ పిచ్చి పిచ్చిగా మాట్లాడారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో తప్పుడు వ్యాఖ్యలు చేస్తే టీఆర్ఎస్ మహిళా నాయకులు ఊరుకోరని హెచ్చరించారు. చట్టపరంగా పోలీసులు, మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సుశీలారెడ్డితో లీలా, సువర్ణా రెడ్డి, గీతాగౌడ్, ఉమావతి, ప్రభారెడ్డి, సుజాతా గౌడ్, ప్రీతి రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



### చరిత్రలో నేటినిజం



కం॥ స్వల్పమ్ముగ సుడి యాడ-న
నల్పమ్ముగ కృషి నొనర్చి -అద్భుత నటిగా
'శిల్పా శిరోద్క'రా కీర్తి-వి
కల్పమ్ముగ నటికయవనికను ప్రేయించెనో!

(నవంబర్ 20 శిల్పా శిరోద్కర్ జయంతి...)



-రాధశ్రీ
సెల్:9494481210

## ఓయూలో బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి మంత్రుల భూమిపూజ

హైదరాబాద్, నవంబర్ 19: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రూ. 39.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బాయ్స్ హాస్టల్ భవనానికి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీ, ఓయూ వీసీ రవీందర్ యాదవ్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రితో పాటు ఓయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో అత్యాధునిక వసతులతో 2.76 ఎకరాల్లో రూ.39.50 కోట్ల అంచనా వ్యయంతో, 1,06,292 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. 3 అంతస్థుల్లో 500 మంది విద్యార్థులకు వసతి కల్పించే ఈ హాస్టల్‌ను ఏడాదిలోపు అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం ఓయూలో 24 హాస్టళ్లు ఉండగా, ఇందులో బాయ్స్ (12), ఉమెన్స్ (12). వర్సిటీలో 70శాతానికి పైగా అమ్మాయిలే ఉండటంతో బాలుర హాస్టల్‌ను గతేడాది అమ్మాయిలకు కేటాయించారు. అబ్బాయిలు ఉండేందుకు హాస్టళ్లు లేకపోవడంతో నూతన హాస్టల్ నిర్మాణానికి టీఎస్ఈడబ్ల్యూఐడీసీ అధికారులు టెండర్లు పూర్తిచేశారు.

## సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అడవుల సంరక్షణ : మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 19: రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అటవీ ప్రాంత అభివృద్ధికి, అటవిపై ఆధారపడ్డ అట్టడుగు వర్గాలకు ఆర్థిక చేయూతను అందించే విధంగా అటవీ శాఖ చర్యలు తీసుకుంటుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.

యూఎస్ ఎయిడ్ , కేంద్ర అటవీ పర్యావరణ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టిన ఫారెస్ట్ ప్లస్ 2.0 కార్యక్రమంలో భాగంగా డెసిషన్ సపోర్ట్ సిస్టం ఆగ్రోఫారెస్ట్రీ వెబ్ పోర్టల్, కమ్యూనిటీ బేస్డ్ ఎకో సిస్టం టూరిజం, ఆగ్రోఫారెస్ట్రీ టూల్ అండ్ షేరింగ్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్ అండ్ వర్కింగ్ ప్లాన్ మాన్యువల్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. అటవీ అభివృద్ధి, అడవుల పునరు జ్జీవనం, హరితహారం కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పెంపు కోసం తెలంగాణ ప్రభుత్వం కోసం చేస్తున్న కృషిని వివరించారు. నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, చెక్ డ్యాంల నిర్మాణం లాంటి నీటి వనరుల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగింద న్నారు. హరితహారం కార్యక్రమం ద్వారా తెలంగాణ హరిత రాష్ట్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్, పొలిటిక్స్ అండ్ ఎకానమిక్స్ చీఫ్ షాన్ రూత్, హైదరాబాద్, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ అండ్ సీఈవో (కంపా) లోకేష్ జైస్వాల్, యూఎస్ ఎయిడ్ ఇండియా సీనియర్ ఫారెస్ట్రీ అడ్వైజర్ వర్గీస్ పాల్, ఫారెస్ట్ ప్లస్ 2.0 చీఫ్ ఆఫ్ పార్టీ ఉజ్వల్ ప్రధాన్, మెదక్ అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ఫారెస్ట్ ప్లస్ రీజనల్ డైరెక్టర్ జి. సాయిలు, అటవీ శాఖ సర్కిల్ హెడ్ లు, అన్ని జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు.. డిసెంబర్ నుంచి తరగతులు ప్రారంభం : శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్, నవంబర్ 19: మహబూబ్‌నగర్ జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు అయినట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈనెలలోనే కళాశాలను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. డిసెంబర్ నుండి నర్సింగ్ కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

శనివారం మహబూబ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మితో నర్సింగ్ కళాశాల ప్రారంభంపై సమీక్షించారు. ప్రస్తుతానికి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భవనంలోని పైభాగంలో కళాశాలను ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. నర్సింగ్ కళాశాలకు త్వరలోనే పక్కా భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకుగాను గతంలోనే భూమిని కూడా సేకరించి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌లో 60 మందితో ప్రారంభం కానున్న మహబూబ్‌నగర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో భవిష్యత్తులో అవసరమైన అన్ని వసతులను కల్పించడంతోపాటు, మరింత మంది చదువుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా నర్సింగ్ పీజీ కళాశాల కూడా తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.

జిల్లాలో గతంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అరకొర వసతులు, డాక్టర్లు, నర్సుల కొరతతో ఇబ్బందుల్లో ఉండేదని.. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను మెరుగుపరిచినట్లు మంత్రి తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు చికిత్స అందించడమే కాకుండా, ఆక్సిజన్ ప్లాంటును, ఆక్సిజన్ సిలిండర్లను తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పినట్లు చెప్పారు. వైద్య పరంగా మహబూబ్‌నగర్ జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

## రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ ..ప్రతిపాదనలు సిద్ధం చేయండి : మంత్రి ఎర్రబెల్లి




హైదరాబాద్, నవంబర్ 19: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని రోడ్లు అద్దంలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హైదరాబాద్ లో శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో నిర్వహించిన వర్క్ షాప్ లో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

దేశానికి రోల్ మోడల్ గా నిలిచిన తెలంగాణ లో ప్రజలు రోడ్లమీద ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే రోడ్ల మరమ్మతులు, నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలి. పంచాయతీ రాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ, అదనపు నిధులకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. డిసెంబర్ 6వ తేదీ నాటికి కొత్త ఎస్.ఈ ఆఫీసుల ఏర్పాటు. 15వ తేదీ నాటికి రోడ్ల మరమ్మతుల టెండర్లు పూర్తి కావాలని' అన్నారు. ఈ ఏడాది రూ. 1500 కోట్ల బడ్జెట్ ఉందని, దీనికి రెట్టింపుగా రూ. 3వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

వరదనీటితో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని వెల్లడించారు. రోడ్ల నిర్మాణంలో అటవీ భూముల సమస్యను గుర్తించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పెంపు కోసం విదేశాల్లో అధ్యయనం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలను పక్కాగా అమలు చేస్తే భవిష్యత్ లో పంచాయతీ రూపురేఖలు మారి శాఖ మరింత బలోపేతం అవుతుందన్నారు.

శాఖ పునర్వ్యవస్థీకరణ వేగవంతానికి ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ వేసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ సెక్రటరీ సందీప్ సుల్తానియా, ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవరావు, చీఫ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో విషాదం.. మంచు చరియలు విరిగి ముగ్గురు జవాన్లు మృతి

శ్రీనగర్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో విషాదం నెలకొంది. మచిల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద మంచు చరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. శుక్రవారం 56 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన జవాన్ల బృందం పెట్రోలింగ్‌కు వెళ్లింది. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ప్రమాదవశాత్తు మంచు చరియలు విరిగి పడటంతో.. ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. హిమపాతంలో చిక్కుకుపోయిన మరో ఇద్దరు జవాన్లను రక్షించి, కుప్వారాలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన జవాన్లకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. అక్టోబర్‌లో ఉత్తరాఖండ్‌లో సంభవించిన హిమపాతం కారణంగా 27 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## పెన్షనర్లకు ఎస్బీఐ 'వాట్సాప్' సేవలు.. ఎందుకంటే?!

హైదరాబాద్, నవంబర్ 19: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్.. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) తన ఖాతాదారులకు అనునిత్యం కొత్త సేవలు అందుబాటులోకి తెస్తోంది. తాజాగా సీనియర్ సిటిజన్ల కోసం వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. సీనియర్ సిటిజన్లు ప్రతి నెలా పెన్షన్ స్లిప్ కోసం బ్యాంకు శాఖకు వెళ్లనవసరం లేకుండా ఇంటి నుంచే పొందేందుకు ఈ ఫెసిలిటీ కల్పిస్తోంది. దీంతో ఎటువంటి అవాంతరాలు లేకుండా, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా వాట్సాప్ ద్వారా సీనియర్ సిటిజన్లు తమ పెన్షన్ స్లిప్ పొందే వెసులుబాటు లభిస్తుంది.

వాట్సాప్ ద్వారా పెన్షన్ స్లిప్ పొందాలనుకునే సీనియర్ సిటిజన్ ఖాతాదారులు మాత్రం తాము బ్యాంకులో రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి + 91 9022690226 అనే మొబైల్ నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ పంపితే చాలు.. వాట్సాప్ ద్వారా ఖాతాదారులు కేవలం పెన్షన్ స్లిప్ మాత్రమే కాక, మినీ స్టేట్మెంట్, బ్యాలెన్స్ ఎంక్వైరీ తదితర సేవలు కూడా పొందొచ్చు. ఎస్బీఐ వాట్సాప్ సేవలు పొందగోరు ఖాతాదారులు తొలుత తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. అలా చేయకపోతే సంబంధిత సీనియర్ సిటిజన్లు తమ రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్ నంబర్ నుంచి చింభీఇఢ అని టైప్ చేసి.. స్పేస్ ఇవ్వాలి. అటుపై మీ ఖాతా నంబర్ టైప్ చేసి 72089 33148 మొబైల్ నంబర్ కు ఎస్సెమ్మెస్ పంపాలి. బ్యాంకులో మీ ఖాతాతోపాటు రిజిస్టర్ చేసిన మొబైల్ ఫోన్ నుంచే ఈ మెసేజ్ పంపాల్సి ఉంటుంది. కనుక ముందు మీ బ్యాంకు శాఖలో మీ మొబైల్ ఫోన్ నంబర్ అప్డేట్ చేసుకోవడం మరువొద్దు.

## ప్రభుత్వం ఆద్వర్యం లో అయ్యప్ప భక్తులకు బిక్ష,అల్పాహార విందు ఏర్పాటు చేయాలి

**-శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాములకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలి-వసేన పార్టీ డిమాండ్**




హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అయ్యప్పలతో లాల్ బహదూర్ స్టేడియంలో అయ్యప్ప పూజ మరియు బిక్ష అల్పాహార విందు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించాలి తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించాలని శివసేన పార్టీ డిమాండ్ చేసింది. శనివారం పార్టీ ఆధ్వర్యం లో అంబర్పేట్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద శివసేన పార్టీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఏ.సుదర్శన్ ఆద్వర్యం లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్బంగా సుదర్శన్ మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఇఫ్తార్ విందు లాల్ బహదూర్ స్టేడియం లో సీఎం గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు మరియు క్రిస్మస్ వేడుకలు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో లాల్ బహదూర్ స్టేడియం లో నిర్వహిస్తారు. అయ్యప్ప స్వాములకు కూడా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అయ్యప్ప పూజ భిక్ష అల్పాహారం విందు కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేసారు. అన్ని మతాలను అన్ని కులాలను ఒకే విధంగా చూడాలని మనస్ఫూర్తిగా సీఎం కేసిఆర్ ను నీ శివసేన పార్టీ పరంగా విజ్ఞప్తి చేసారు. సీఎం కేసీఆర్ గారు వెంటనే అయ్యప్ప స్వాముల కు పూజ బిక్ష అల్పార విందు నిర్వహించాలని, శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాములకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో గౌట్ గణేష్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు మరియు అయ్యప్ప స్వాములు శ్రీ బాపి రాజు విజయ్ మధు శివకుమార్ శ్రీనివాస్ మనోజ్ కృష్ణ నాయుడు రమేష్ ప్రభాకర్ రమేశస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి పువ్వాడ శంకుస్థాపనలు

ఖమ్మం, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో పలు డివిజన్ లలో రూ.90లక్షలతో నిర్మించనున్న సీసీ సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

ఖమ్మం నగరంలోని 3వ డివిజన్ బల్లేపల్లి, 5వ డివిజన్ బాలాజీ నగర్ లో రూ.45 లక్షలు మొత్తం రూ.90 లక్షలతో నిర్మించనున్న సీసీ సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు మంత్రి పువ్వాడ శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు పల్లెబోయిన భారతి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ లు రంగారావు, సిబ్బంది, డివిజన్ నాయకులు ఉన్నారు.



# మాతాశిశు ఆరోగ్య అభద్రతలో నేటి మాతాశిశువులు

## (20 నవంబర్ "విశ్వ బాలల దినోత్సవం" సందర్భంగా)

నేటి బాలలే రేపటి పౌరులు. బాలల పెంపకంపైననే వారి సంపూర్ణ శారీరక, మానసిక ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. శిశు పోషణ వల్ల వారి భవిష్యత్తు ఆరోగ్యం నిర్ణయించబడుతుంది. బాలల సమగ్రాభివృద్ధిలో తల్లితండ్రుల బాధ్యత అధికంగా ఉంటుంది. విశ్వ మానవాళికి సురక్షిత జీవనం, ఆరోగ్యం, ఆహారం, విద్య, మానవీయత లాంటి మౌళిక హక్కులు ఉంటాయి. ప్రపంచదేశాల్లో 385 మిలియన్ల బాలలు దారిద్ర్యరేఖ దిగువన, 153 మిలియన్ల అనాధలు దుర్భర జీవితాన్ని గడపడం విచారకరం. వీరిలో రోజుకు 8,500 మంది బాలలు పోషకాహారలోపంతో మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పిల్లలకు పోషకాహారలోపం, వస్త్రాల లభ్యతలో కొరత, అనారోగ్య సమస్యలు, అవిద్య, అలక్ష్యం, బాలకార్మిక వ్యవస్థ, లైంగిక వేదింపులు, అంతర్జాల అశ్లీలత లాంటి సమస్యలు వెన్నాడుతూనే ఉన్నాయి. విశ్వ బాలల సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని 1959లో ఐరాస తీర్మానం ప్రకారం ప్రతియేటా 20 నవంబర్ రోజున "ప్రపంచ/విశ్వ బాలల దినోత్సవం" నిర్వహిస్తున్నారు. 1949 నుండి కొన్ని దేశాల్లో 01 జూన్ రోజున బాలల దినాన్ని పాటించే ఆనవాయితీ కూడా ఉండేది.

**వైరుధ్య వాస్తవాలు:**

భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా పేదరికం 21 శాతం తగ్గడం, శిశు మరణాలు సగానికి పైగా కట్టడి కావడం, 80 శాతానికి పైగా గర్భిణులు ఆసుపత్రుల్లో ప్రసవించడం లాంటి అనుభవాలతో పాటు 2 మిలియన్ల పిల్లలు బడులకు దూరమైపోవడం వంటి విభిన్న వాస్తవాలు బయట పడ్డాయి. దీనికి తోడుగా నిన్నటి కోవిడ్-19 కల్లోలం కారణంగా ఉద్భవించిన సామాజిక ఆర్థిక ప్రభావంతో అదనంగా మిలియన్ల 5 సంవత్సరాల లోపు వయస్సుగల బాలలు ప్రమాదకర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, సగానికి పైగా బాలల మరణాలు నమోదు అవుతున్నాయని 'యూనిసెఫ్-2020 నివేదిక' కఠిన వాస్తవాలను వెల్లడించడం విచారకరం. ప్రతి ముగ్గురు బాలల్లో ఒక్కరు తీవ్ర పోషకాహారలోపంతో బాధ పడుతున్నారు. పోషకాహారలోపంతో బాధపడుతున్న బాలలకు కరోనా లాంటి అనేక అంటువ్యాధులు తొందరగా సోకుతాయని తెలుపుతున్నారు. కడుపేదరికం, పని దొరక్క పోవడం, ఆహార అభద్రత కారణాలు బాలల ఆరోగ్యంపై విష ప్రభావాన్ని చూపిస్తున్నాయి. విపత్తులు, ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం పెరుగుదల వంటి ప్రతికూలతల ఫలితంగా పోషకాహార సరఫరా దెబ్బతిని, ధరలు పెరగడంతో బాలలు కనీస పోషకాహారానికి దూరం అవుతూ, తీవ్ర పోషకాహారలోప స్థితితో 38.4 శాతం బాలల శారీరక అభివృద్ధి ఆగిపోయిన కారణంగా వయస్సు కన్న అతి తక్కువ ఎత్తుతో (స్టంటింగ్) పొట్టి వాళ్ళలా మారుతున్నారని కూడా గుర్తించారు.

**ప్రకృతి విరుద్ధ లింగ నిష్పత్తి:**

మన దేశంలో మగ శిశువుల కన్న ఆడ శిశు మరణాలు ఎక్కువగా నమోదు కావడం బాధాకరం. దీని కారణంగా మగ ఆడ పిల్లల నిష్పత్తి 1000:900 ఉండడం ప్రకృతి విరుద్ధమని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 5 ఏండ్ల లోపు బాలురు 7 శాతం మరణిస్తే, మన ఇండియాలో 11 శాతం బాలికలు మరణిస్తున్నారు. గ్రామీణ, పట్టణ మురికివాడలు, యస్‌సి, యస్‌టి, పేదకుటుంబాలకు చెందిన పిల్లల్లో పోషకాహారలోపం, ఆరోగ్యవసతుల లేమి, బాల్యవివాహాలు, పాఠశాలలకు పిల్లలు దూరమవడం, పరిసరాల మరియు వ్యక్తిగత అపరిశుభ్రత, సురక్షిత త్రాగునీరు లేకపోవడం లాంటి సమస్యలు చుట్టు ముడుతున్నాయి. దేశ కౌమారదశ (10 - 19 ఏండ్ల) పిల్లల జనాభా 253 మిలియన్లు ఉన్నది. బాల్యవివాహాలు చేసుకున్న కూతుర్ల సంఖ్యలో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో ఉంది. వీరిలో అనారోగ్యం, చిన్నతనంలోనే తల్లి కావడం, పోషకాహారం అందకపోవడం, ఆర్థిక వెనుకబాటు, సంతానం బలహీనంగా ఉండటం వంటి సమస్యలు వెన్నాడుతాయి. కౌమారదశ బాలికల్లో 54 శాతం, 30 శాతం బాలురు రక్తహీనత సమస్యలతో సతమతం అవుతున్నారు. మన దేశంలో 60-90 శాతం బాలికలు ఏదో ఒక సందర్భంలో లైంగిక అత్యాచారాలు, హింసలు లేదా వేధింపులను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 189 దేశాల మానవ అభివృద్ధి సూచిక జాబితాలో ఇండియా 130వ స్థానంలో ఉన్నది. భారతదేశ భాగ్యవిధాతలుగా ఎదగాల్సిన బాలలు ఆహారకొరత, పోషకాహారలోపం, అనారోగ్యం, అవిద్య, బాలకార్మిక వ్యవస్థ, బాలల లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు లాంటి తీవ్ర సమస్యలతో సంసారం చేస్తున్నారు.

**పోషకాహార అభద్రత:**

కరోనాకు ముందు ప్రపంచవ్యాప్తంగా 47 మిలియన్ల బాలలు పోషకాహార (వేస్టింగ్) సమస్యలతో సహజీవనం చేస్తే, ప్రస్తుత కరోనా అనంతర కాలంలో వారి సంఖ్య 54 మిలియన్లకు చేరడం మె?దటిసారి ఈ మిలినియంలో జరిగింది. కరోనా వ్యాప్తితో పేద దేశాలలో పోషకాహార లోపంతో బాధపడుతున్న 5 ఏండ్ల లోపు బాలల సంఖ్య 14.3 శాతం పెరిగిందని గుర్తించారు. దీని పర్యవసానంగా సగానికి పైగా బాలలు పోషకాహారలోపంతో మరణిస్తున్నారని అనుమానిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా 250 మిలియన్ల బాలలకు విటమిన్-ఏ అందలేదని, దాదాపు 25 శాతం వరకు పోషకాహార లోపం పెరిగిందని తేల్చారు. వీటి ఫలితంగా 1.28 లక్షల అదనపు బాలల మరణాలు జరుగవచ్చని విశ్లేషించారు. గర్భిణి స్త్రీలకు అందవలసిన సమతుల పోషకాహారం అందక పోవడం కూడా పరిస్థితి తీవ్రతను మరింత జటిలం చేస్తుందని నివేదిక తెలుపుతోంది. బాలలకు జీవించడం, శారీరకంగా మానసికంగా ఎదగడం, వేధింపుల నుండి రక్షణ, అభివృద్ధిలో పాలుపంచుకోవడమనేవి రాజ్యాంగ హక్కులని గుర్తించింది. ఆకలి, అకాలమరణాలు, అత్యాచారాలు, బాలకార్మిక దురాచారం, అవిద్య, పోషకాహారలేమి లాంటి సవాళ్ళను దేశం సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. మన దేశంలో 2012-17 మధ్య కాలంలో 2.43 లక్షల బాలికలు/మహిళలు కనబడకుండా పోయారని విషయం విస్మయాన్ని కలుగజేస్తున్నది.

**బాలల పరిరక్షణ మన బాధ్యత:**

విపత్తు అనంతర కాలంలో రేపటి పౌరుల పోషకాహార హక్కులను కాపాడేందుకు ఆయాదేశాల ప్రభుత్వాలు, సామాన్య ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు, దాతలు వెంటనే స్పందించాల్సి ఉంది. ఆహార ఉత్పత్తి రంగాల ప్రోత్సాహం, ఆహార సరఫరా నియంత్రణ, తల్లిపాల రక్షణ, బాలలకు, తల్లులకు సమతుల ఆహార లభ్యతలను కాపాడాల్సి ఉంది. బాలల్లో పోషకాహార లోపాల్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడం, పేద కుటుంబాలకు ఆహారాన్ని ఇంటి వద్దనే పంపిణి చేయడం, పాఠశాలల్లో సురక్షిత మధ్యాహ్న భోజనం కల్పించడం లాంటి అంశాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ ప్రణాళిక ప్రకారం కోవిడ్-19 ధాటికి తట్టుకుంటున్న విశ్వమానవాళి, ముఖ్యంగా ఐదేళ్ల లోపు బాలలను రక్షించుకోవడానికి రెస్పాండ్(స్పందించు), రికవర్(క్షేమంగా బయటపడడం) మరియు రీఇమేజిన్(తిరిగి రూపాన్నివ్వడం) అనబడే త్రిసుత్రాలను ప్రతిపాదించారు.

బాలల సమస్య జటిలం కాక పూర్వమే తగు చర్యలు తీసుకోవడం, సమస్యలతో సతమతమవుతున్న వారిని రక్షించుకోవడం, బయట పడిన వారిని సంరక్షించుకోవడం అనే విషయాలకు కట్టుబడి మాతాశిశ ఆరోగ్యాలను చూసుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని నమ్ముదాం. రేపటి తరాన్ని పువ్వుల్లో పెట్టుకొని పెంచుకుంటూ, ఆరోగ్యకర యువ శ్రేష్ట భవ్య భారతాన్ని నిర్మించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ప్రతినిధులందరికీ ప్రత్యేక చలనచిత్ర అనుభవాలను 53వ ఇఫ్ఫీ అందిస్తుంది: భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 19:53వ ఇఫ్ఫీ (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకలు విజయవంతం కావాలని కోరుకుంటూ, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు.

ఆసియాలోని ప్రఖ్యాత చలన చిత్రోత్సవాల్లో ఒకటైన ఇఫ్ఫీ నిర్వాహకులకు, ప్రతినిధులకు, అతిథులకు శ్రీ ముర్ము అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ సంబంధాలను ప్రోత్సహించడంలో ఇఫ్ఫీ సహకారం గొప్పదని చెప్పారు. ఈ వేడుక నిర్వహణ దక్షిణాసియాలో కీలక సత్సంబంధ వారధిగా నిలుస్తుందని; చిత్ర నిర్మాతలు, కళాకారులు, పరిశ్రమ నిపుణులు, సినీ ప్రముఖులు తమ ఆలోచనలను పరస్పరం మార్చుకోవడానికి, ఘనమైన అనుభవాలను పంచుకోవడానికి వీలు కల్పిస్తుందని రాష్ట్రపతి చెప్పారు.

సృజనాత్మక, వినోద మాధ్యమంగా చలనచిత్రం నిలుస్తుందని రాష్ట్రపతి తెలిపారు. చలనచిత్రం అంటే దృశ్యం, శబ్దం, కథా నైపుణ్యాలను అందించే మాధ్యమం కాబట్టి, 53వ ఇఫ్ఫీ వేడుక ప్రతినిధులందరికీ ప్రత్యేక చలనచిత్ర అనుభవాలను అందిస్తుందని తాను కచ్చితంగా భావిస్తున్నట్లు చెప్పారు.

## గాంధీ భవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల భేటీ

హైదరాబాద్, నవంబర్ 19: గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య నేతలు భేటీ అయ్యారు. సాయంత్రం జూమ్ మీటింగ్‌లో చర్చించాల్సిన ఎజెండా అంశాలపై నేతలు చర్చించుకుంటున్నారు. ఈ సమావేశానికి సీఎల్పీ నేత భట్టి శ్రీధర్ బాబు, షబ్బీర్ అలీ, కోదండ రెడ్డి, అన్వేష్ రెడ్డి, మల్లు రవి పాల్గొన్నారు. సమావేశం ముఖ్య ఉద్దేశ్యం రాష్ట్ర రాజకీయాలపై సాగనుంది. తెలంగాణలో వేగంగా రాజకీయాల్లో మార్పు చోటుచేసుకుంటున్న క్రమంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్, బీజేపీలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెస్తోంది.


తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ - IJU)
TUWJ Telangana State Union of Working Journalists
ఆహ్వానము
యాదాద్రి భువనగిరి జిల్లా ద్వితీయ మహాసభ
తేది : 20-11-2022 ఆదివారం, ఉ॥ 11-00 గం॥లకు
స్థలం : మహాకవి దాశరథి అవార్డు గ్రహీత డాక్టర్ తిరునగరి ప్రాంగణం, S.L.N.S. కన్వెన్షన్ హాల్ (పాత గ్రీన్‌ల్యాండ్), కలెక్టరేట్‌రోడ్, భువనగిరి.

ముఖ్య అతిథులు :
శ్రీమతి గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి గారు – ప్రభుత్వ విప్, ఆలేరు ఎం.ఎల్.ఏ.
శ్రీ పైళ్ళ శేఖర్‌రెడ్డి గారు – ఎం.ఎల్.ఏ, భువనగిరి.
శ్రీ ఎలిమినేటి కృష్ణారెడ్డి గారు – ఎం.ఎల్.సి.
శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డి గారు – ఐ.జె.యు.అధ్యక్షులు

గౌరవ అతిథులు :
శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గారు – యం.పి. భువనగిరి.
శ్రీ ఎలిమినేటి సందీప్‌రెడ్డి గారు – జడ్.పి. చైర్మన్, యాదాద్రి భువనగిరి.

విశిష్ట అతిథులు :
శ్రీ గాదరి కిషోర్ కుమార్ గారు – ఎం.ఎల్.ఏ. తుంగతుర్తి.
శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారు – ఎం.ఎల్.ఏ. మునుగోడు.
శ్రీ చిరుమర్తి లింగయ్య గారు – ఎం.ఎల్.ఏ. నకిరేకల్.
శ్రీ గొంగిడి మహేందర్ రెడ్డి గారు – డి.సి.సి.బి. చైర్మన్, టెస్కాబ్ ఉపాధ్యక్షులు
శ్రీమతి పమేలా సత్పత్తి గారు – I.A.S. జిల్లా కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, యాదాద్రి భువనగిరి.
శ్రీ కె. నారాయణ రెడ్డి గారు – I.P.S. డి.సి.పి. యాదాద్రి జోన్

ఆత్మీయ అతిథులు :
శ్రీ నగునూరి శేఖర్ గారు – రాష్ట్ర అధ్యక్షులు TUWJ (IJU)
శ్రీ విరాహత్ అలీ గారు – రాష్ట్ర ప్రధాన కార్యదర్శి TUWJ (IJU)
శ్రీ వై. నరేందర్ రెడ్డి గారు – జాతీయ కార్యదర్శి, ఐజెయు
శ్రీ యం.డి. యూసుఫ్‌బాబు గారు – అధ్యక్షులు, రాష్ట్ర చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం
శ్రీ కె. సత్యనారాయణ గారు – జాతీయ కార్యవర్గ సభ్యులు, ఐజెయు
శ్రీ ఎలిమినేటి ఇంద్రారెడ్డి గారు – జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఐజెయు
శ్రీ ఎనబోయిన ఆంజనేయులు గారు – చైర్మన్, భువనగిరి పురపాలక సంఘం
శ్రీ భువనగిరి మల్లేష్ గారు – జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఐజెయు
శ్రీ యంబ నరసింహులు గారు – జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు, ఐజెయు
శ్రీ మరాటి రవి గారు – రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, TUWJ

ప్రత్యేక అతిథులు :
శ్రీ పి.వి. శ్యాంసుందర్ రావు గారు – జిల్లా బి.జె.పి. అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి.
శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు – డి.సి.సి. అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి.
శ్రీ కంచర్ల రామకృష్ణా రెడ్డి గారు – జిల్లా టి.ఆర్.ఎస్. అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి.
శ్రీ గోద శ్రీరాములు గారు – సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి, యాదాద్రి భువనగిరి.
శ్రీ ఎం.డి. జహంగీర్ గారు – సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి, యాదాద్రి భువనగిరి
శ్రీ పి. వెంకటేశ్వర్ రావు గారు – డి.పి.ఆర్.ఓ. యాదాద్రి భువనగిరి.

నివేదిక సమర్పణ : వెలిమినేటి జహంగీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి
TUWJ (IJU) యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ


## ఇండియాగేట్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు!

న్యూఢిల్లీ, నవంబర్ 19: న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద పచ్చిక బయలులో 2022, నవంబర్ 19, 20 తేదీలలో విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని సంగీత నాటక అకాడమి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.


నవంబర్ 19వ తేదీన జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా, చెండా మేళం, కథక్ నృత్యం, తోలు బొమ్మలాట, మణిపురి నాట్యం,.. నవంబర్ 20న ఒడిస్సీ నృత్యం, కథక్ నృత్యం ప్రదర్శించనున్నారు. నవంబర్ 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

నవంబర్ 19 మరియు 20 తేదీలలో ఢిల్లీ పంచవాద్య ట్రస్ట్ ఆధ్వర్యంలో చెండా మేళం ప్రదర్శించబడుతుంది. పంచారీమేళం అనేది కేరళలోని ఆలయ ఉత్సవాల సమయంలో నిర్వహించే ఒక బ్యాండుమేళం ప్రదర్శన. చెండా మేళం (సామూహిక డ్రమ్)కు చెందిన ప్రధాన కళారూపాలలో పంచారీ మేళం(పంచారీ) కూడా ఒకటి. ఇది క్షేత్రవాద్యం (ఆలయ బ్యాండుమేళం) శైలిలో అత్యంత ప్రసిద్ధి చెందిన వాద్యవిశేషం. అత్యంత ప్రజాదరణ పొందిన కళారూపం. పంచారీ మేళం, చెండ, ఇలతాళం , బేస్ చెండ (వలంతల) వంటి వాయిద్యాలతో కూడిన ప్రదర్శన మధ్య కేరళలోని అనేక ఆలయాల ఉత్సవాల్లో, వేడుకల్లో ప్రదర్శిస్తారు. ఇక్కడ అత్యంత సాంప్రదాయ పద్ధతిలో ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. ఉత్తర కేరళ (మలబార్), దక్షిణ-మధ్య కేరళ (కొచ్చి)లో సూక్ష్మమైన ప్రాంతీయ భేదంతో పంచారీ కళారూపాన్ని సాంప్రదాయబద్ధంగా ప్రదర్శిస్తూ ఉంటారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కలాశిష్ సంస్థకు చెందిన విద్యార్థులు కథక్ నృత్యం ప్రదర్శిస్తారు. రాగ్‌భోపాలీ, తీన్‌తాళ్‌లో, ఓం నమఃశివాయ అనే కళారూపాన్ని వారు ప్రదర్శిస్తారు, ఆ తర్వాత ద్రుత్తెంతాళ్, రాగ్‌జన్‌సమ్మోహినీ పద్ధతిలో పండిట్ విజయ్‌శంకర్, రూపకల్పన చేసిన చేసిన తరానా కళారూపాన్ని ప్రదర్శిస్తారు. ప్రస్తుత ప్రదర్శనకు కొరియో గ్రాఫర్‌గా అసావరీ పవార్ వ్యవహరిస్తారు. నవంబర్ 19వ తేదీన మహ్మద్ షమీమ్ బృందం ఆధ్వర్యంలో, నవంబర్ 20న కాలాబాజ్ బృందం ఆధ్వర్యంలో తోలుబొమ్మలాట ప్రదర్శనలు నిర్వహిస్తారు. మణిపురి నృత్యాన్ని పంథోయిబి జాగోయ్ మరూప్, ఒడిస్సీ నృత్యరూపాన్ని సంచారి ఫౌండేషన్ సభ్యులు నిర్వహిస్తారు. నవంబర్ 20న రుద్రాక్ష్ కథక్ నృత్య ప్రదర్శన ఉంటుంది.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2022,సెప్టెంబరు 8వ తేదీన సెంట్రల్ వెస్టా ప్రాజెక్టును ప్రారంభించిన తర్వాత, మహాత్మా గాంధీ, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, రాజా రామ్ మోహన్ రాయ్ స్మారకార్థం కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తూ ఉండటం గమనార్హం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుల నుంచి, మహిళా సాధికారత, సైబర్ నేరాల నిరోధం వరకు అనేక సామాజిక సమస్యలు, అంశాల ప్రాతిపదిగగా ఈ కార్యక్రమాలను రూపొందించారు. సందర్శకులు ఎవరైనా ఈ కార్యక్రమాలకు ఉచితంగా హాజరు కావచ్చు. ఈ కార్యక్రమాల ద్వారా నవ భారతదేశం అభివృద్ధిని గురించి సందర్శకులు తెలుసుకోవచ్చు.

## వ్యక్తిగత సమాచార పరిరక్షణ హక్కును గుర్తించే డిజిటల్ డేటా



న్యూఢిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వ్యక్తిగత సమాచార పరిరక్షణ హక్కును గుర్తించే డిజిటల్ డేటా పర్సనల్ ప్రొటెక్షన్ బిల్, 2022 ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రజల ముందు ఉంచింది. వచ్చే నెల 17నాటికి దీనిపై అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ లింక్‌ను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ట్వీట్ చేశారు. ఈ బిల్లులో ముఖ్యాంశాలను పరిశీలిస్తే, మన దేశ శాసన చరిత్రలో మొట్టమొదటిసారి స్త్రీ, పురుష, నపుంసక లింగాలకు ఆమె, ఆమె యొక్క అనే పదాలను ఉపయోగించారు. వ్యక్తి స్త్రీ, పురుష, నపుంసకుల్లో ఏ వర్గానికి చెందినవారైనప్పటికీ, ఆ వ్యక్తిని సంబోధించేటపుడు ఆమె లేదా ఆమె యొక్క అనే పదాలను ఉపయోగించారు. మహిళలను సాధికారులను చేయాలన్న ప్రభుత్వ సిద్ధాంతానికి అనుగుణంగానే ఈ మాటలను ఉపయోగించినట్లు ఈ ముసాయిదా బిల్లు పేర్కొంది.

ఏడు సూత్రాలు : ఈ బిల్లును ఏడు సూత్రాల ఆధారంగా రూపొందించారు.

1. వ్యక్తిగత సమాచారాన్ని సంస్థలు చట్టపరమైన పద్ధతిలో ఉపయోగించుకోవడం.

2. వ్యక్తిగత సమాచారాన్ని ప్రాసెస్ చేయడం వెనుక ఉద్దేశాన్ని స్పష్టంగా వెల్లడించాలి. ఏ వ్యక్తి యొక్క వ్యక్తిగత సమాచారాన్ని ప్రాసెస్ చేస్తున్నారో ఆ వ్యక్తికి ఆ విషయాన్ని తెలియజేయాలి. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, ప్రాసెస్ చేస్తామని పొడి పొడిగా చెబితే సరిపోదు. దీనినే పర్పస్ లిమిటేషన్ సూత్రం అంటారు.

3. నిర్దిష్ట ప్రయోజనాన్ని నెరవేర్చేందుకు అవసరమైన, ప్రత్యక్ష సంబంధంగల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి మాత్రమే డేటా కంట్రోలర్ పరిమితం కావాలి. దీనినే డేటా మినిమైజేషన్ అంటారు. ఆ ప్రయోజనాన్ని నెరవేర్చేందుకు అవసరమైనంత కాలం మాత్రమే ఆ సమాచారాన్ని తన వద్ద ఉంచుకోవాలి. 4. పర్సనల్ డేటా యాక్యురసీ, 5. స్టోరేజ్ లిమిటేషన్, 6. వ్యక్తిగత సమాచార ఉల్లంఘన నిరోధం, 7. డేటా ప్రాసెసింగ్ కోసం జవాబుదారీతనం. ఇదిలావుండగా, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, సింగపూర్ వంటి దేశాల్లోని చట్టాలను పరిశీలించి ఈ బిల్లును రూపొందించారు.

## ఇటుక బట్టీల్లో వలస కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు : పెద్దపల్లి డీసీపీ రూపేష్

కరీంనగర్, నవంబర్ 19: ఇటుక బట్టీల్లో పని చేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులను యజమానులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని పెద్దపల్లి డీసీపీ రూపేశ్ పేర్కొన్నారు. శనివారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇటు-క బట్టి యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వలస కార్మికులు బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాల నుండి ఇటు-క బట్టీ-ల్లో పనిచేసేందుకు వచ్చారని, వారికి ఇబ్బంది కలగకుండా బట్టల వద్ద కనీస సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం కార్మికుల పిల్లలకు చదువులు నేర్పించాలని, మైనర్లతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటుక బట్టీల ఆవరణలోనే విద్యార్థులకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన చేయించాలన్నారు. అలాగే మహిళలపై ఎలాంటి వేధింపులకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటుక



బట్టీలలో పని చేసే కార్మికుల ఆధార్ కార్డులతో కూడిన వివరాలు పోలీస్‌స్టేషన్‌లో అందించాలని, ఎలాంటి గొడవలు జరిగినా, అనుకోని సంఘటనలు జరిగినా సమాచారం అందించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పెద్దపెల్లి ఏసిపి సారంగపాణి, సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు ఉపేందర్‌రావు, వినీత, బట్టిల యజమానులు పాల్గొన్నారు.

## టీడీపీ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ప్రారంభం



అమరావతి: నవంబర్ 19:మంగళగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం ప్రారంభమైంది. పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై నేతలతో చర్చిస్తున్నారు. టీడీపీ ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నారని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్రానికి ఇదేం కర్మ అనే కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించడంతో పాటు కార్యక్రమం ఎజెండాను పార్టీ నేతలకు వివరించనున్నారు. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. వచ్చే రెండు నెలల్లో యాభైకి పైగా నియోజకవర్గాల్లో రోడ్ షోలు నిర్వహించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

## నెంబరు ప్లేట్ లేని వాహనదారులకు జరిమానాలు తప్పవు : పెద్దపల్లి డీసీపీ రూపేష్



కరీంనగర్, నవంబర్ 19: నంబర్ ప్లేట్ లేని వాహన దారులకు జరిమాణాలు తప్పవని పెద్దపల్లి డీసీపీ రూపేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్ లేని ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన డీసీపీ రూపేష్ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా ముందు వెనక నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు హెల్మెట్ ధరించాలని ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అలాగే నంబర్ ప్లేట్ లేకుంటే గుర్తింపు ఉండదని తద్వారా ప్రమాదం జరిగినప్పుడు గుర్తించడం ఇబ్బందికరంగా మారుతుందని ప్రజలందరూ దీనిని గమనించి విధిగా నంబర్ ప్లేట్ కలిగి ఉండాలన్నారు. ఇకపై తరచూ పోలీసులు దాడులు నిర్వహిస్తారని నంబర్ ప్లేట్లు ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సాదుల సారంగపాణి సిఐ ఇంద్రసేన రెడ్డి ఎస్ఐలు ఉపేందర్ రావు అశోక్ రెడ్డి వినీత లతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ మాత్రమే క్రూరమైన జోకులు వేయగలదు: మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ, నవంబర్ 19: మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యి తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్.. మసాజ్ చేయించుకుంటున్న వీడియో ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ వీడియోపై ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా క్లారిటీ ఇచ్చారు.

సత్యేందర్ జైన్ మసాజ్ చేయించుకోలేదని, వెన్నెముక నొప్పితో బాధపడుతున్న ఆయనకు వైద్యులు ఫిజియోథెరపీ చేశారని చెప్పారు. అనారోగ్యానికి చికిత్స చేయించుకుంటున్న వీడియోను లీక్ చేసి బీజేపీ రాజకీయం చేస్తున్నదని ఆయన విమర్శించారు. బాధితులపై కూడా క్రూరమైన జోకులు వేయగల సామర్థ్యం బీజేపీకి మాత్రమే ఉన్నదని సిసోడియా వ్యాఖ్యానించారు.

## హాస్టల్లో విద్యార్థినిలకు దుప్పట్లు పంపిణి



నరసారావు పెట్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); చలి తీవ్రత దృష్ట్యా మానవతా దృక్పదం తో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ బీసి ప్రజాసమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు క్షత్రి పండరిబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నరసరావుపేట బిసి లేడీస్ హాస్టల్ లో దుప్పట్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా క్షత్రి పండరిబాయి లేడీస్ హాస్టల్ బాలికల మధ్య కేక్ కట్ చేసి అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా పండరిబాయి మాట్లాడుతూ శీతాకాలంలో పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా మానవతా దృక్పదం తో విద్యార్థునీలకు నాణ్యమైన దుప్పట్లు పంపిణి చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు..లేడీస్ హాస్టల్లో విద్యార్థినిలు పండరిభాయికు హ్యాపీ బర్త్ డే మేడమ్ అంటూ విషెస్ తెలిపారు. బాలికల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం తనకెంతో ఆనందానిచ్చింది అని పండరి బాయి సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా లక్ష కుంకుమార్చన



తిరుపతి, నవంబర్ 19:తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో లక్ష కుంకుమార్చననను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారి ఉత్సవర్లను శ్రీకృష్ణస్వామి ముఖ మండపానికి వేంచేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

గృహస్తులు రూ.1,116 చెల్లించి టికెట్ కొనుగోలు చేసి లక్ష కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. వీరికి ఒక ఉత్తరీయం, ఒక రవికె, రెండు లడ్లు, రెండు వడలు బహుమానంగా అందజేశారు. కాగా రాత్రి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, ఆలయ నాలుగు మాడ వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించిన తరువాత శాస్త్రోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహిస్తామని వేదపండితులు తెలిపారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

హైదరాబాద్, నవంబర్ 19: పేదల సంక్షేమానికి ప్ర భుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో 20వ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఎనిమిది గుడిసెలు(రేకుల) దగ్ధమయ్యాయి. శుక్రవారం బాధితులను వారు పరామర్శించారు. ఎమ్మెల్యే వారికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగితెలుసుకున్నారు. అనంతరం బాధితులను ఓదార్చి ప్రభుత్వ పథకాల ద్వారా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్‌నీలా గోపాల్‌రెడ్డి,డిప్యూటీ మేయర్ ధన్‌రాజు,కార్పొరేటర్లు బాలాజీ నాయక్, చిట్ల దివాకర్,కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌సలీం,సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొలన్‌గోపాల్‌రెడ్డి,రవికాం త్,జ గన్,దూసకంటి వెంకటేశ్, సందీప్, సురేశ్, హరియానాయక్, పరమేశ్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### అంజమ్మకు నగదు అందజేత

జీడిమెట్ల, నవంబర్18: పేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన అంజమ్మ ఇంటి పైకప్పు గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ శుక్రవారం భగత్‌సింగ్‌నగర్‌కు చేరుకుని అంజమ్మకు తనవంతు సహాయంగా రూ.50 వేల నగదును అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఇంటి నిర్మాణానికి కృషి చేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) భగత్‌సింగ్‌నగర్ ప్రెసిడెంట్ సామ్రాట్, నాయకులు ఉప్పలయ్య, లక్ష్మణ్, ప్రభాకర్, అశోక్, జిల్లా వెంకటేశ్, పంగరాజు, రవదరాజు, సుభాశ్, చందు, శ్రీధర్‌గౌడ్, బస్వరాజు, భీసు వెంకటేశ్‌గౌడ్, జాంగీర్, రాఘవేంద్ర, అభిలాశ్, లక్ష్మమ్మ, నరసమ్మ, సుబ్బమ్మ ఉన్నారు.




## ప్రగతిభవన్ నుండి జనజీవనంలోకి ఆ..నలుగురు ఎంఎల్ఏలు



హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టీఆర్ఎస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు ఎర వేస్తూ.. బీజేపీ మధ్యవర్తులుగా పేర్కొంటున్న ముగ్గురు ప్రయత్నించటం.. ఎమ్మెల్యేల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఎమ్మెల్యేలను విడిచిపెట్టటం తెలిసిందే. ఈ నందర్భంగా ఎమ్మెల్యేలు నలుగురు అదే రోజు రాత్రి ప్రగతిభవన్ కు వెళ్లారు. కట్ చేస్తే.. గడిచిన 22 రోజులుగా వారు అక్కడే ఉంటున్నారు.

ఇలా ముఖ్యమంత్రి అధికార నివాసంలో నలుగురు ఎమ్మెల్యేలు ఉండిపోవటం సంచలనమైంది. తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయితే.. ఎమ్మెల్యేలకు హాని ఉందని.. అందుకే ప్రగతి భవన్ లో ఉన్నారని చెబుతున్నా.. ఈ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఇరవై రెండు రోజుల్లో మధ్యలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన ప్రెస్ మీట్ల మినహా బయటకు వచ్చింది లేదు. అసలు ఎప్పటికి బయటకు వస్తారన్న సందేహాలు వ్యక్తమైన పరిస్థితి. ఇదిలా ఉంటే.. తమ ఎమ్మెల్యేలు కనిపించటం లేదంటూ నియోజకవర్గానికి చెందిన పలువురు ఫిర్యాదులు చేశారు. ఇలాంటి వేళ.. నలుగురు ఎమ్మెల్యేల్లో ఒకరైన రోహిత్ రెడ్డి కొందరు మీడియా ప్రతినిధులకు అందుబాటులోకి వచ్చారు. తాము శనివారం ప్రగతిభవన్ నుంచి బయటకు వస్తున్నట్లుగా పేర్కొన్నారు.ప్రతి ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా తాను అయ్యప్ప మాల వేసుకుంటానని.. ప్రగతిభవన్ నుంచి బయటకు రాగానే అయ్యప్ప మాలాధారణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రగతి భవన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత నుంచి తాను నియోజకవర్గ డెవలప్ మెంట్ మీదనే ఫోకస్ చేస్తానని.. తనకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై తాను మాట్లాడలేనని చెప్పిన రోహిత్ రెడ్డికి పలువురు ఒక ప్రశ్నను సంధిస్తున్నారు. ప్రాణహాని ఉన్నందున గడిచిన 22 రోజులుగా ప్రగతి భవన్ లో ఉన్న వారు ఇప్పుడు బయటకు వస్తున్నారు మరి.. ఇప్పుడువారికి హాని లేనట్లా తగ్గిపోయిందా ఆ విషయంపై వారికి అంత నమ్మకం ఎలా వచ్చింది ఇలాంటి ప్రశ్నలకు రోమిత్ రెడ్డితో పాటు.. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఏమని బదులిస్తారు అన్నది అసలు ప్రశ్న.

## జగన్ ఆస్తుల కేసులో హెటిరో సంస్థకు చుక్కెదురు.. క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 19:వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆస్తుల కేసులో హెటెరో సంస్థకు చుక్కెదురైంది. తమపై దాఖలైన కేసులను క్వాష్ చేయాలంటూ హెటెరో సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసులో సీబీఐ చార్జిషీటు పక్కాగా ఉందని, ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో హెటెరో కంపెనీ విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పింది.

గత ఏడాది నవంబర్‌లో తెలంగాణ హైకోర్టు జగన్ అక్రమాస్తుల కేసులో హెటిరో డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డితో పాటు హెటిరో గ్రూప్‌ను కేసు నుంచి తొలగించేందుకు నిరాకరిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో హెటిలో సవాల్ చేసింది. వరుసగా ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో హెటెరో గ్రూపునకు నిరాశ కలిగించే ఫలితమే ఎదురైంది.

అరబిందో, హెటిరో సంస్థలకు జడ్చర్ల సెజ్‌లో భూ కేటాయింపుపై దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో శ్రీనివాస్‌రెడ్డి, హెటిరో సంస్థను నిందితుల జాబితాలో సీబీఐ చేర్చిన విషయం తెలిసిందే. సీబీఐ అభియోగాల్లో నిజం లేదని, జగన్ సంస్థల్లో పెట్టుబడులు వ్యాపార వ్యూహాల్లో భాగమేనని, భూ కేటాయింపుల్లో అక్రమాలేవీ జరగలేదని హెటిరో తరపు న్యాయవాదులు వినిపించారు. జగన్ ప్రమేయంతో అప్పటి వైఎస్ సర్కారు హెటిరో సంస్థకు తక్కువ ధరకు భూమిని కేటాయించిందని సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.

జగన్ సంస్థల్లో హెటిరో 2006, 2007లో రెండు దఫాలుగా పెట్టుబడి పెట్టిందని, అదే సమయంలో ఆ సంస్థకు వైఎస్ ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించిందని సీబీఐ చెబుతోంది. 2008లో మరోసారి పెట్టుబడి పెట్టిన తర్వాతే 75 ఎకరాల భూమి కేటాయించారన్నారు. ఈ వ్యవహారంలో హెటిరో ఎండి శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారు కాబట్టే ఆయనను నిందితుడిగా చేర్చామని స్పష్టం చేశారు. హెటెరో సంస్థల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. ఎఫ్.ఐ.ఆర్ లో హెటెరో సంస్థ మొత్తాన్ని చేర్చడం న్యాయవిరుద్ధమని అన్నారు. హెటెరో కంపెనీలో పనిచేసే వ్యక్తులపై కేసు పెట్టొచ్చు కానీ కంపెనీపై కాదని వాదించారు. అయితే ధర్మాసనం ఈ వాదనలను పరిగణలోకి తీసుకోలేదు. జగన్ కంపెనీ ప్రారంభించకముందే ఆయన కంపెనీలో ఒక్కొక్క షేర్‌పై రూ. 350 అదనంగా ప్రీమియం చెల్లించి హెటెరో సంస్థ పెట్టుబడులు పెట్టిందని, ఇదంతా కూడా హెటెరో సంస్థకు స్థలాన్ని కెటాయించినందుకే జరిగిందని సీబీఐ చేస్తున్న వాదనలతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. హెటెరోపై దాఖలైన కేసు కొట్టివేయదగినది కాదని, విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది.

## విద్యుత్ సవరణ బిల్లుపై వైసీపీకి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

విజయవాడ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్న్యూస్ );పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టే విద్యుత్ సవరణ బిల్లుకు వైసీపీ ఆమోదం తెలిపితే వైసీపీకి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.అంటీ కాదు రైతు సంఘాల నుంచి ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు తప్పవు. పోనీ మద్దతివ్వకుండా ఉండటం కూడా కుదరదు. ఎందుకంటే కీలకమైన బిల్లు విషయంలో వైసీపీ మద్దతివ్వకపోతే ఏం జరుగుతుందో.. బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఏం చేయగలరో వైసీపీకి తెలుసంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో వైసీపీ భాగస్వామ్య పార్టీ కాదు. అయినప్పటికీ మొదటి నుంచి బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ వైసీపీ మద్దతిస్తూ వస్తోంది. కొన్నిటి విషయాల్లో కేంద్రం అడగకపోయినా సరే వైసీపీనే ముందుగా మద్దతిచ్చిందనే అభియోగాలూ ఉన్నాయి. మరోవైపు ఏపీ సీఎం జగన్ తనపై ఉన్న అక్రమాస్తుల కేసుల విచారణ వేగంగా జరగకుండా తన బెయిల్ రద్దు అవ్వకుండా ఉండేందుకే బీజేపీ ప్రభుత్వం చెప్పినట్టు చేస్తున్నారని ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. తన కేసులకు భయపడి రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీ పడుతున్నారని మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలకు తెర లేచింది. డిసెంబర్ 7 నుంచి 29 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతాయని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో వైసీపీ పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా ఉందని అంటున్నారు. డిసెంబర్ 7 నుంచి జరిగే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం దాదాపు 30 బిల్లుల వరకు ప్రవేశపెట్టనుందని సమాచారం. వీటిలో విద్యుత్ సవరణ బిల్లు వ్యక్తిగత సమాచారం భద్రత బిల్లు వన్యప్రాణుల సంరక్షణ సవరణ బిల్లు న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ సవరణ బిల్లు తదితరాలు ఉన్నాయని చెబుతున్నారు.

అయితే పార్లమెంటు రెండు సభల్లో బీజేపీకి ఈ బిల్లులను ఆమోదించుకోగల స్థాయిలో సభ్యులున్నారు. రాజ్యసభలో మిత్రపక్షాలతో కలిపి బీజేపీకి బొటాబొటి మెజారిటీ ఉంది. మరోవైపు మొదటి నుంచి ఒడిశాలోని బిజూ జనతాదళ్ అంశాల ప్రాతిపదికగా బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తోంది. మరోవైపు వైసీపీ.. బీజేపీ ప్రభుత్వం అడగాలే తడవుగా దేనికైనా తమ మద్దతు రెడీ అన్నట్టు వ్యవహరిస్తోంది. అయితే ఈసారి వైసీపీకి సంక్షిష్ట సమస్య ఎదురుకానుందని అంటున్నారు. వచ్చే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విద్యుత్ సవరణ బిల్లును కూడా కేంద్రం ప్రవేశపెట్టనుంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులకే ఈ బిల్లు తెస్తున్నామని కేంద్రం చెబుతోంది. అయితే.. ఈ బిల్లు వల్ల రైతులకు నష్టం కలుగుతుందని వ్యవసాయ మోటార్లకు మోటార్లు బిగిస్తారని ఉచిత విద్యుత్ ఇవ్వడం సాధ్యం కాదని కేంద్రం రైతుల నడ్డి విరగకొట్టడానికి ప్రయత్నిస్తోందని ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. తమ రాష్ట్రాల్లో వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడానికి తాము ఒప్పుకోబోమని తెలంగాణ పశ్చిమ బెంగాల్ జార్ఖండ్ ఢిల్లీ తమిళనాడు ముఖ్యమంత్రులు.. కేసీఆర్ మమతా బెనర్జీ హేమంత్ సోరెన్ అరవింద్ కేజ్రీవాల్ ఎంకే స్టాలిన్ ప్రకటించారు.

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఇప్పుడు కేంద్రం విద్యుత్ పంపిణీ సవరణ చట్టం చేస్తే రైతుల వ్యవసాయ మోటార్లు/బోర్లకు స్మార్ట్ మీటర్లు పెడతారు. దీంతో ఉచిత విద్యుత్కు మంగళం పాడినట్టేనని అంటున్నారు. దీంతో రైతులే తమ విద్యుత్ బిల్లులు కట్టుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ప్రభుత్వం తమ రాష్ట్రంలో వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లను బిగించడానికి ఒప్పుకోబోమని విస్పష్ట ప్రకటన చేసింది. మరోవైపు వైసీపీ ప్రభుత్వం మాత్రం స్మార్ట్ మీటర్ల వల్ల ఎలాంటి నష్టం లేదని.. నేరుగా రైతుల ఖాతాల్లోనే విద్యుత్ బిల్లులు చెల్లించడానికి తాము డబ్బులు చెల్లిస్తామని చెబుతోంది. అయితే ఏపీ ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి ఉన్న నేపథ్యంలో ఉద్యోగులకే నకాలంలో జీతాలివ్వలేకపోతోందని ప్రతిపక్షాలు గుర్తు చేస్తున్నాయి. ఇలాంటి దుస్థితిలో రైతులకు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి రైతుల ఖాతాల్లో ఎలా వేయగలదని ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం వేసే వరకు రైతులు బిల్లులు చెల్లించకుండా ఉంటే విద్యుత్ కనెక్షన్లు డిస్కంలు తొలగిస్తాయని అంటున్నారు.

## శబరిమలకు వెళ్తున్న ఏపీ బస్సుకు ప్రమాదం .. 18 మంది అయ్యప్ప భక్తులకు గాయాలు



అమరావతి: నవంబర్ 19: ఆంధ్రప్రదేశ్ నుంచి శబరిమలకు వెళుతున్న బస్ ప్రమాదవాశాత్తు లోయలో పడి 18 మంది అయ్యప్ప భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరుకు చెందిన 84 మంది అయ్యప్ప భక్తులు శబరిమలలోని అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు రెండు టూరిస్టు బస్సుల్లో బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న ఒక బస్సు కేరళలోని పతనంథిట్ట వద్ద లోయలో బోల్తా పడింది. బస్సు ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా స్టీరింగ్ పట్టేయడంతో వెనక్కి వస్తూ బోల్తాపడిందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు తెలిపారు.ఏలూరు జిల్లా మాదేపల్లి ప్రాంతానికి చెందిన 18 మంది భక్తులు ఈ ప్రమాదంలో గాయపడారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఘటన విషయాన్ని తెలుసుకున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎమ్మెల్యే అబ్బాయ్యచౌదరి క్షతగాత్రులకు వైద్యం సహాయం నిమిత్తం కేరళ ప్రభుత్వంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు .

## కృష్ణా జలాల పంపకాలపై కీలక భేటీ.. ఈనెల 24న ఆర్ఎంసీ సమావేశం

అమరావతి: నవంబర్ 19:తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపకాలతో పాటు ఇతర కీలక విషయాలపై చర్చించి తీర్మానాలు చేసేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబీ) రిజర్వాయర్ మేనేజింగ్ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశం నిర్వహించనుంది. హైదరాబాద్‌లోని జలసౌధలో ఈనెల 24న నిర్వహించనున్న సమావేశానికి ఏపీ, తెలంగాణ నుంచి జలవనరుల శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. కృష్ణా బోర్డు విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే ఆర్ఎంసీ సమావేశాలు నాలుగయిదుసార్లు వాయిదాపడగా మరికొన్నిసార్లు ఉమ్మడి ప్రాజెక్టులపై తుది తీర్మానాలు ఆమోదం పొందకుండానే అర్థాంతరంగా ముగిశాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన నాగార్జునసాగర్, శ్రీశైలం నిర్వహణలోనూ, వరద జలాల లెక్కలు, జలవిద్యుదుత్పత్తికి అనుసరించాల్సిన నిబంధనలు, ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి ఏ ప్రాంతానికి ఎప్పుడు నీటిని విడుదల చేయాలనే అంశంపై నియమావళి (రూల్ కర్వ్) రూపకల్పన చేయటంలో ఏపీ, తెలంగాణల మధ్య ఏకాభిప్రాయం కుదరటం లేదు.


దీంతో ఆర్ఎంసీ సమావేశాలు తుది నిర్ణయాలకు అవకాశం లేకుండానే ముగుస్తున్నాయి. ఆర్ఎంసీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై ముసాయిదా నివేదికను రూపొందించాక కృష్ణా బోర్డు ఆమోదం పొందాల్సి ఉంటు–ంది. రెండు రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్ దాదాపు ముగిసినా ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. బోర్డు నిర్వహణ నియామవళితో సంబంధం లేకుండానే అందుబాటులోకి వచ్చిన జలాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో 2022–2023 నీటి సంవత్సరంలో మిగిలి ఉన్న సమయానికైనా విధివిధానాలు అమలు చేసేందుకు వీలుగా ఈనెల 24న నిర్వహించనున్న సమావేశంలో తుది తీర్మానాలు చేయాలని కృష్ణా బోర్డు భావిస్తోంది. కృష్ణా బేసిన్‌లో నీటి పంపకాలతో పాటు వరద జలాల లెక్కలు, రూల్ కర్వ్ ఇతర విషయాలపై రెండు రాష్ట్రాలతో చర్చించి ఏకాభిప్రాయంతో ముసాయిదా రూపొందించి అమలు చేసేందుకు వీలుగా కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)రిజర్వాయర్ మేనేజింగ్ కమిటీని నియమించింది. కృష్ణా బోర్డు సభ్యుడు ఆర్.కె పిళ్లై కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కమిటీలో రెండు రాష్ట్రాలు జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)లు, విద్యుదుత్పత్తిపై చర్చించేందు కోసం రెండు రాష్ట్రాల జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌లను సభ్యులుగా ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలం నుంచి నీటిని తోడేస్తూ తెలంగాణ జెన్‌కో చేస్తున్న విద్యుదుత్పత్తిపై ఏపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. 2020–21, 2021–22 నీటి సంవత్సరాల్లో తెలంగాణ విద్యుదుత్పత్తి వల్ల తీవ్రంగా నష్టపోవటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డుతో పాటు కేంద్ర జలశక్తికి ఫిర్యాదు చేసింది. దీనిపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజికి చేరువైన సమయంలో, ఎగువ నుంచి వరదలు కూడా లేని సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణ విద్యుదుత్పత్తి చేయటం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఏపీ ఆరోపిస్తోంది. శ్రీశైలంలో విద్యుదుత్పత్తి నియంత్రణపై విధివిధానాలు రూపొందించటంతో పాటు వాటి అమలుకు ప్రోటోకాల్ పాటించాలని ఏపీ డిమాండ్ చేస్తోంది. వరద జలాల లెక్కల విషయంలోనూ ఏపీ అధికారులు తమ వాదన బలంగా వినిపిస్తున్నారు.

బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కృష్ణాకు దిగువన ఉన్న ఏపీకి వరదల రూపంలో సముంద్రంలో కలిసే మిగులు జలాలపై సంపూర్ణ హక్కులున్న సంగతిని గుర్తు చేస్తోంది. కృష్ణాలో నికర జలాల పంపిణీ అంశంలో మిగులు జలాల ప్రస్తావనకు అవకాశమే లేదని ఏపీ వాదిస్తోంది. తెలంగాణ కూడా కృష్ణా జలాలను ఏపీ బేసిన్ అవతలకు తరలిస్తోందని ఆరోపిస్తోంది. గాలేరి–నగరి నుంచి హంద్రీనావాకు నీటి తరలిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తోంది. అనుమతుల్లేని ప్రాజెక్టులకూ, అందులోనూ కృష్ణా బేసిన్‌తో సంబంధంలేని ప్రాంతాలకు నీటిని తరలించే విషయంలో ఆర్ఎంసీ విధి విధానాలు రూపొందించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 24న నిర్వహించనున్న సమావేశంలో రెండు రాష్ట్రాలతో చర్చించటం ద్వారా కృష్ణాబోర్డు రిజర్వాయర్ మేనేజింగ్ కమిటీ– కీలక తీర్మానాలకు తుదిరూపునిచ్చే అవకాశముంది.

## కాంగ్రెస్ లోని అసమ్మతులు బీజేపీలోకి...

### –పావులు కదుపుతున్న డి.కే.అరుణ



హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి ఎప్పుడు నియామకం అయ్యాడో అప్పటి నుంచే తెలంగాణ కాంగ్రెస్ సీనియర్లు తట్టుకోలేకపోతున్నారు. భగ్గుమంటున్నారు.. వెంకటరెడ్డి జగ్గారెడ్డి శశిధర్ రెడ్డి లాంటి వారు ముందు నుంచి టీడీపీ నుంచి వచ్చిన రేవంత్ కు పగ్గాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీతోనూ టచ్ లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు అధికారికంగా కాంగ్రెస్ సీఎంగా చేసిన మహానేత కుమారుడు బీజేపీలో చేరడానికి రెడీ కావడం కాంగ్రెస్ కు గట్టి షాక్ ఇచ్చినట్టైంది. కాంగ్రెస్ నుంచి ఈ సీనియర్ నేత బీజేపీలో చేరడం ఖచ్చితంగా రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ కు దెబ్బగానే చెప్పొచ్చు.రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన శశిధర్ రెడ్డి కాంగ్రెస్ కు షాకిచ్చాడు. బీజేపీ చీఫ్ బండి సంజయ్ డీకే అరుణతో కలిసి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటి అయ్యారు. దీంతో ఆయన బీజేపీలో చేరడం ఖాయమైంది. కాషాయ కండువా కప్పుకోవడానికి రెడీ అయిపోయారు. జేపీ నడ్డా సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకోనున్నట్టు సమాచారం.మర్రి శశిధర్ రెడ్డి కొంతకాలంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తెలంగాణ ఇన్ చార్జి మాణిక్యం ఠాగూర్ లపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. వీరిద్దరి వల్లే కాంగ్రెస్ కల్లోలం అవుతోందని.. కీలక నేతలు వెళ్లిపోవడానికి.. పార్టీ ఓడడానికి వీరే కారణమని ఆరోపించారు. ఈ క్రమంలోనే అసంతృప్తిగా ఉన్న మర్రి ఇప్పుడు పార్టీ మారుతున్నారు.మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు సీఎంగా పనిచేశారు.ఆయన మరణం అనంతరం వారసుడిగా శశిధర్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్ఆర్ హయాంలోనే శశిధర్ రెడ్డికి మంత్రి పదవితోపాటు పార్టీలో గుర్తింపు దక్కింది.సనత్ నియోజకవర్గం నుంచి మర్రి ఏకంగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాడు. 1992,1994, 2004,2009 ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతిలో ఓడిపోయారు.

రేవంత్ రెడ్డి తీరు నచ్చకనే మర్రి పార్టీ మారుతున్నట్టు తెలుస్తోంది. బీజేపీలో చేరాక రేవంత్ నే టార్గెట్ చేయనున్నారు. ఇక కాంగ్రెస్ లోని సీనియర్ నేతలను బీజేపీలోకి చేర్చే బాధ్యతను డీకే అరుణ తీసుకున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ లోని అసమ్మతులు అందరినీ బీజేపీలో చేర్పించడానికి రంగం సిద్ధం చేసినట్టు సమాచారం.

## నిజామాబాద్ జిల్లాలో అట్టహాసంగా నమస్తే తెలంగాణ ఆటో షో ప్రారంభం

నిజామాబాద్, నవంబర్ 19: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో షో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వెంకటరమణ, నమస్తే తెలంగాణ ప్రకటన విభాగం జనరల్ మేనేజర్ సురేందర్ రావు, తదితర అతిథుల సమక్షంలో ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఇవాళ, రేపు కొనసాగనుంది.

మొత్తం 22 స్టాళ్లు ఏర్పాటు చేయగా జాతీయ బ్యాంకులతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటోమొబైల్ సంస్థలకు చెందిన డీలర్లు ప్రదర్శనలో పాల్గొన్నారు. కొత్త తరం వాహనాలను పరిశీలించిన అతిథులు స్వయంగా టెస్ట్ డ్రైవ్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మెట్రో నగరాలకు పరిమితమైన ఆటో షో లాంటి కార్యక్రమాన్ని నిజామాబాద్ నగరానికి తీసుకువచ్చిన నమస్తే తెలంగాణ యాజమాన్యాన్ని కలెక్టర్, సీపీలు అభినందించారు.

# ఎమ్మెల్యేల కొనుగోలు కేసు పక్కదారి పట్టించేందుకు బీజేపీ కుట్ర : మంత్రి ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 19:ఎమ్మెల్యేల కొనుగోలు కేసును పక్కదారి పట్టించేందుకు బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.. నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఇంటిపై దాడి చేస్తే గవర్నర్ తమిళి సై ట్విట్టర్ వేదికగా స్పందించారని, మరి కవిత ఇంటిపై దాడి చేసినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అరవింద్ సంస్కార హీనుడని, మహిళలను గౌరవించడం తెలియదా అని మంత్రి ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు.

# తిరుమలలో భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి, నవంబర్ 19: తిరుమలలో పోలీసులు భారీగా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుమల నుంచి తిరుపతి వచ్చే మార్గంలో గాలి గోపురం వద్ద అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 11 మంది స్మగర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 85 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. కోటి వరకు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న అటవి ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందని పోలీసులకు అందిన సమాచారం మేరకు గత మే నెలలో అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ పెరుమాళ్‌తో పాటు మరో నిందితుడిని పట్టుకున్నారు. వీరి వద్ద రూ.3 కోట్ల విలువైన 100 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

# ప్రీమియం ఎకానమీ క్లాస్‌ను ప్రవేశపెట్టనున్న ఎయిర్ ఇండియా

న్యూఢిల్లీ, నవంబర్ 19: రాబోయే రోజుల్లో విమానాల సంఖ్యను పెంచడంతో పాటు దేశీ, విదేశీ రూట్లలో మార్కెట్ వాటాను కనీసం 30 శాతానికి పెంచుకోవడంపై ఎయిర్ ఇండియా దృష్టి సారించింది. ఈ దిశగా కొన్ని అంతర్జాతీయ విమానాల్లో ప్రీమియం ఎకానమీ క్లాస్‌ను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

వచ్చే నెలలో కొన్ని ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌లో ప్రీమియం ఎకానమీ క్లాస్‌ను ప్రవేశపెడతామని ఎయిర్ ఇండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. ఎయిర్‌లైన్‌ను టేకోవర్ చేసిన టాటా గ్రూప్ ఎయిర్ ఇండియా పునరుద్ధరణ ప్రణాళికను అమలు చేస్తోంది. రాబోయే ఐదేండ్లలో విమానాల సంఖ్యతో పాటు గ్లోబల్ నెట్‌వర్క్‌ను విస్తరించే లక్ష్యంగా ముందుకెళుతోంది. ఇక స్వల్పకాలంలో కార్పెట్ల రీప్లేస్‌మెంట్, సీట్ కుషన్స్, కవర్స్‌ను ఆకర్షణీయంగా అమర్చడం, విమానంలో ఎంటర్టైన్‌మెంట్ సిస్టమ్స్‌ను చక్కదిద్దడం వంటి చర్యలు చేపడుతోంది.

ముంబైలో జేఆర్‌డీ టాటా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ విల్సన్ ఈ వివరాలు వెల్లడించారు. దేశీ విమానాల్లో మెనూను ఇటీవల పూర్తిగా పునరుద్ధరించామని చెప్పారు. నిధులు, విడిపరికాల లేమితో నిలిచిపోయిన 20 విమానాలను ఎయిర్ ఇండియా పునరుద్ధరించిందని తెలిపారు.

# బ్యాంకులిస్తున్నాయని క్రెడిట్ కార్డు తీసుకుంటున్నారా.. ముందు ఈ విషయాలు తెలుసుకోండి!

న్యూఢిల్లీ, నవంబర్ 19: కొవిడ్-19 మహమ్మారి తర్వాత వినియోగదారుల కొనుగోళ్లు పెరిగాయి. తమ అవసరాలను బట్టి లోన్లు తీసుకోవడంతోపాటు క్రెడిట్ కార్డుల వినియోగం కూడా ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇక కొత్త క్రెడిట్ కార్డులు తీసుకునే వారిని ఆకట్టుకోవడానికి క్రెడిట్ కార్డు జారీ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఫెస్టివ్ సీజన్‌లో స్పెషలాఫర్లు ఇచ్చిన క్రెడిట్ కార్డు జారీ సంస్థలు.. ఇయర్ ముగింపు దశలో మళ్లీ అవే ఆఫర్లు ముందుకు తెస్తున్నాయి.వస్తువుల కొనుగోళ్లతోపాటు జీవన శైలి ఖర్చుల కోసం కొందరు క్రెడిట్ కార్డులు తీసుకుంటూ ఉంటారు. అటువంటప్పుడు క్రెడిట్ కార్డు తీసుకునే ప్రతి ఒక్కరూ ఆ కార్డు తమ కుటుంబ అవసరాలకు సరిపడుతుందా? లేదా? అన్న సంగతి చెక్ చేసుకోవాలి. ఇప్పుడు ప్రతి వస్తువు కూడా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తుంటారు. అటువంటప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ జరిపితే డిస్కౌంట్లు ఇచ్చే క్రెడిట్ కార్డులను గుర్తించి, వాటిని తీసుకోవడానికి ప్రయత్నించండి.

### డిస్కౌంట్లు, ఆఫర్ల ప్రలోభాలకు గురి కావొద్దు

క్రెడిట్ కార్డు జారీ సంస్థలు కొత్తగా జారీ చేస్తున్న క్రెడిట్ కార్డులు డిస్కౌంట్ల పేరిట వస్తువుల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నా.. అవి ఎంత వరకు ఉపయోగం అన్న సంగతి చెక్ చేసుకోవాలి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్రెడిట్ కార్డు ఎంపిక చేసుకోవద్దు. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ డెలివరీ సంస్థలు, కొన్ని బ్రాండ్లతో క్రెడిట్ కార్డు జారీ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకుని రాయితీలు అందిస్తాయి. ఈ బెనిఫిట్లతో ఎప్పుడో ఉపయోగం ఉంటుంది.

### క్రెడిట్ కార్డు ఉచిత సేవలపై ఇలా

ఇక ప్రతి క్రెడిట్ కార్డు జారీ సంస్థ తాము ఉచిత సేవలు అందిస్తున్నాం అని అంటుంటాయి. కానీ.. క్రెడిట్ కార్డులకు వార్షిక ఫీజు మినహాయింపు కోసం కొన్ని నిబంధనలు ఉంటాయి. ప్రతి ఏటా కొంత నిర్దిష్ట మొత్తం కొనుగోళ్లు జరిపితే క్రెడిట్ కార్డు వార్షిక ఫీజు మాఫీ అవుతుంది. మరి కొన్ని క్రెడిట్ కార్డు జారీ సంస్థలు వార్షిక ఫీజు వసూలు చేస్తాయి. తదనుగుణంగా కొన్ని బెనిఫిట్లు కల్పిస్తాయి. ఇలా సదరు క్రెడిట్ కార్డులతో లభించే ప్రయోజనాల్లో అత్యధికం మనకు ఉపయోగపడనివే ఉంటాయి. హోటల్లో బస చేస్తే రాయితీ, గోల్ఫ్ కోర్సులు, ఎయిర్ పోర్టు లాంజీల్లో ఎంట్రీ వంటి ఉచిత సౌకర్యాలు కల్పిస్తాయి. కానీ తరుచుగా విమాన ప్రయాణాలు చేసే వారికి ఈ వసతులతో బెనిఫిట్లు లభిస్తాయి.

### ఇవీ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డుతో బెనిఫిట్లు

ప్రస్తుతం పలు క్రెడిట్ కార్డు జారీ సంస్థలు.. కొన్ని బ్రాండ్లతో కలిపి కో- బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు జారీ చేస్తాయి. ఆయా బ్రాండ్ వస్తువులతో అనుబంధం ఉంటేనే.. కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులతో బెనిఫిట్లు పొందొచ్చు. అధిక రివార్డులు, రాయితీలు పొందొచ్చు.. అలా కానీ పక్షంలో కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు వల్ల ఉపయోగం ఉండక పోవచ్చు. క్రెడిట్ కార్డులను జారీ చేసే సంస్థలు సంబంధిత వ్యక్తుల నెలవారీ ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్ర తదితర అంశాలను పరిశీలించాకే క్రెడిట్ కార్డు జారీ చేస్తాయి. ఇప్పటి వరకు ఎటువంటి లోన్ తీసుకోకున్నా.. క్రెడిట్ కార్డు లేకున్నా.. ప్రాథమిక ప్రయోజనాలతో కూడిన క్రెడిట్ కార్డు జారీ చేస్తాయి.

### లోన్ తీసుకుంటే ప్రీమియం బెనిఫిట్స్ కార్డు

ఇప్పటికే మీరు రుణాలు తీసుకుని, గుడ్ పేమెంట్స్ చరిత్ర గల వారికి ప్రీమియం ప్రయోజనాలు గల క్రెడిట్ కార్డు వస్తుంది. సిబిల్ స్కోర్ 750 పాయింట్లకు పైగా ఉంటే.. క్రెడిట్ కార్డు పొందడానికి ఇబ్బందులేం ఉండవు. కానీ, స్థిరమైన ఇన్ కం లేని వారు కాసింత జాగ్రత్తగా ఆలోచించిన తర్వాత కొత్త క్రెడిట్ కార్డు తీసుకోవడంపై ఒక నిర్ణయానికి రావాలి.. అటువంటి వారు సాధారణ క్రెడిట్ కార్డు తీసుకోవడం కంటే ఫిక్స్డ్ డిపాజిట్ బేస్డ్ క్రెడిట్ కార్డు తీసుకోవడం బెటర్.

### క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తేనే బెనిఫిట్లు

క్రెడిట్ కార్డు తీసుకోగానే సరిపోదు. దాని వినియోగానికి గల రూల్స్ క్షుణ్ణంగా తెలుసుకోవాలి. స్టేట్ మెంట్ బిల్లింగ్ తేదీలపై అవగాహన కలిగి ఉండాలి. సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తేనే బెనిఫిట్లు ఉంటాయి. కనీస బిల్లు చెల్లింపుతోనూ, బిల్లు బకాయి పడటం వల్లనూ అధిక వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి.ఇక ఎటువంటి పరిస్థితుల్లోనూ క్రెడిట్ కార్డును వినియోగించి క్యాష్ విత్ డ్రాయల్ చేయరాదు. అలా చేస్తే వార్షిక వడ్డీ 36-40 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికే మీరొక క్రెడిట్ కార్డు కలిగి ఉన్నారనుకోండి.. తప్పనిసరి అవసరమైతే తప్ప మరొక క్రెడిట్ కార్డు తీసుకోవద్దు. నిత్యం ఇస్తున్నారని అదే పనిగా క్రెడిట్ కార్డులు తీసుకోవడం మంచి పరిణామం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

# బహిరంగ మల మూత్ర విసర్జనను నివారిద్దాం : మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్, నవంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని వెలికట్ట గ్రామంలో సంపూర్ణ స్వచ్ఛత కోసం స్వచ్ఛతా రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఒక మరుగుదొడ్డిని నిర్మించుకోవాలన్నారు. దీని కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రజలను ప్రోత్సహిస్తుందన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన రహిత రాష్ట్రంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు. ఇంకా ఎక్కడైనా బహిరంగ మలమూత్ర విసర్జన పరిస్థితులు ఉంటే, వెంటనే రూపుమాపాలన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన నివారణ కోసం కృషి చేస్తున్న గ్రామ పంచాయతీని, ప్రజలను దయాకర్ రావు అభినందించారు. వెలికట్ట గ్రామం ఈ రాష్ట్రానికి, దేశానికి ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలికట్ట గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# గోల్డ్ కంపెనీకి టోకరా.. వ్యక్తి అరెస్ట్ : ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



తిరుపతి, నవంబర్ 19:ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేవీఎం గోల్డ్ కంపెనీలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి మోసం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అక్టోబర్ 30వ తేదీన బంగారు నగలతో పాటు కొంత నగదును కూడా దోసుకుని వెళ్లిన కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని వివరించారు. తిరుపతి నగరంలోని కొర్లగుంట ప్రాంతంలో కేవీఎం గోల్డ్ లోన్ ఫైనాన్స్ సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే గతంలో శ్రీకాళహస్తిలో జరిగిన పింక్ కేర్ బ్యాంక్ నేరానికి సంబంధించి అదే తరహాలో ఇక్కడ జరిగిందని వివరించారు. ఇదే సంస్థలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్ శాంత కుమార్ ప్రజల దగ్గర నుంచి బంగారు నగలను కొదవ పెట్టుకుని వారికి డబ్బులు ఇచ్చే వ్యాపారం కంపెనీ తరఫున చేస్తూ ఉండే వారిని తెలియజేశారు. ఇదే క్రమంలో ప్రజల నుంచి వచ్చిన బంగారాన్ని శాంత కుమార్ తన అవసరాలకు వాడుకునే వారన్నారు. ఇతను తన భార్య, స్నేహితులు, పేరుపైన బంగారు నగలను కుదవపెట్టి ఇతరుల బంగారాన్ని కూడా ఇతను తీసుకుని ఇతర ఫైనాన్స్ సంస్థలు పెట్టి లోన్ డబ్బులు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆలస్యంగా కంపెనీ అధికారులు గమనించి ఆడిట్ చేయడానికి బ్యాంక్ కి వస్తామన్న సమాచారాన్ని తెలియజేయడంతో శాంతి కుమార్ మొత్తం బంగారంతో పారిపోవడం జరిగిందని తెలియజేశారు. కుటుంబ సభ్యులు తీసుకుని పారిపోవడానికి తిరుపతికి వచ్చినాడని సమాచారం రావడంతో అతని పట్టుకుని అతని వద్ద నుంచి 10,13.08 గ్రాములు బంగారాన్ని, లక్ష రూపాయలు నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. వీటి యొక్క విలువ రూ.34,58,998 రూపాయలు ఉంటుందన్నారు. అదేవిధంగా కంపెనీలో నలుగురూపంలో కూడా కొంత మొత్తాన్ని తీసుకోవడం జరిగిందన్నారు అతన్ని పోలీస్ కస్టడీలోకి తీసుకొని తర్వాత రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కేసును ప్రతిభ కనబరిచిన ఈస్ట్ సిఐ శివప్రసాద్ రెడ్డి. ఎస్సై జయ స్వాములు. సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డును అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆదరపు ఎస్పి అడ్మిన్ సుప్రజ. ఈస్ట్ డిఎస్పి. మురళీకృష్ణ. సిఐ శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# కాళేశ్వరం జలాలతో కరీంనగర్ సస్యశ్యామలం : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, నవంబర్ 19: కాళేశ్వరం జలాలతో కరీంనగర్ సస్య శ్యామలం అయిందని బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి కమలాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో 65 లక్షలతో డి87న కెనాల్ నుండి రాజసముద్రం చెరువు నింపడానికి నిర్మాణానికి భూమి పూజ చేశారు. నిర్మాణ పనులు 20 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ .. మిషన్ కాకతీయతో చెరువులన్నీ పునరుద్దరణ జరిగిందని.. బీడు భూములన్నీ సాగులోకి వచ్చాయని వెల్లడించారు. సమైక్యాంధ్రలో రైతు ఆత్మహత్యలు నీటి యుద్ధాలు జరిగేవని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక బీడు భూములను సాగులోకి వచ్చాయని అన్నారు. కాళేశ్వరం జలాలతో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని, తెలంగాణ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ కులవృత్తులకు జీవం పోసారని అన్నారు. కాళేశ్వరం మొదటి ఫలితం కరీంనగర్ కి దక్కడం అదృష్టం అన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు మానేరు వాగుపై 5 ఇరుకుల్ల వాగుపై 4 చెక్ డ్యామ్ లు నిర్మించామని అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో చెరువులన్నీ నింపుకున్నామని, తెలంగాణ అభివృద్ధి చూసి పెద్దపెద్ద కంపెనీలన్ని [illegible] తరలివస్తున్నాయన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఢిల్లీ ఆంధ్ర పాలకులు తెలంగాణపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ వనరులను దోచుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సాధించుకున్న తెలంగాణను కాపాడుకునే బాధ్యత ప్రజలదే అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య జడ్పిటిసి పురమల్ల లలిత-శ్రీనివాస్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి సర్పంచ్ లక్ష్మి ఐలయ్య, జక్కం నర్సయ్య, మడికంటి మారుతీ,జువ్వా డి రాజేశ్వర్ రావు, పంది తిరుపతి యాదవ్, కూర నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీమ్ కోర్టు- హై కోర్టు జడ్జీల నియామకాలలో రిజర్వేషన్లు అమలు చేయాలి -బిసి న్యాయవాదుల సదస్సు డిమాండ్

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి తొలగించినందున బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను కూడా జనాభా ప్రకారం 50 శాతం కు పెంచాలని బిసిన్యాయవాదుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది.ఇడబ్ల్యుఎస్ పేరుతో పది శాతం ఉన్నత కులాలకు రిజర్వేషన్లు మరియు సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయ స్థానాలలో బిసి,ఎస్టి,ఎస్సి, జడ్జీల నియామకాల పై శనివారం బిసి భవన్ లో బిసిన్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది.

ఈ సదస్సుకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బిసి రిజర్వేషన్ లవిషయం లో సుప్రీంకోర్టు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను సమర్థిస్తూ తీర్పు చెప్పినందున జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగ రంగాలలో,స్థానిక సంస్థల ఎన్నికలలో , కేంద్రంలో 27 శాతం నుంచి 50శాతం పెంచాలని, సుప్రీమ్ కోర్టు- హై కోర్టు జడ్జీల నియామకాలలో ఎస్సీ/ఎస్టీ.బి.సి లకు రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేసారు. ఇందుకు న్యాయవాదులు ముందువరుసలో ఉండి పోరాటం చేయాలన్నారు.రిజర్వేషన్లపై విధించిన గరిష్ట పరిమితి 50 శాతంనూ సుప్రీం కోర్టు తొలగించినందున ఎలాంటి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు లేనందున బిసి/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేస్తున్నాం. ఇటీవల ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు చెల్లుతాయని, 50% గరిష్ట పరిమితి కూడా సరికాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అలాగే 103వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ 50 శాతం గరిష్ట పరిమితి తొలగించి ఇడబ్ల్యుఎస్ ? లకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. దీనితో రిజర్వేషన్లపై ఉన్న గరిష్ట పరిమితి తొలగిపోయింది. రిజర్వేషన్లపై న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగపరంగా యున్న అవరోధాలు తొలగిపోయాయి. కావున వెంటనే బీసీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం కేంద్రంలో 27 శాతం నుంచి 50 శాతం పెంచాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి వారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలి. కానీ మనదేశంలో 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా ఈ కులాలను అణచిపెట్టారు. ప్రపంచంలో అణచివేతకు వివక్షకు గురైన అన్ని వర్గాలకు, అన్ని రంగాలలో వాటా ఇచ్చి ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చేశారు. కానీ మనదేశంలో పీడిత కులాలను ఇంకా అంది వేయడానికి చూస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు.బీసీలకు ఇచ్చేది బిక్షం కాదు. ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ - పార్లమెంటుల్లో రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారు. ఉద్దేశపూర్వకంగా ఈ కులాలను అందిచేస్తున్నారని విమర్శించారు. 2023 లో సేకరించి బోయే జనాభా గణనలో కులాల వారిగా బీసీ జనాభా గణన చేయాలని సమావేశం కోరింది. ఎస్సీ/ఎస్టీల జనాభా ను కులాల వారిగా సేకరిస్తున్నారు. బీసీల జనాభా సేకరించడానికి అభ్యంతరాలు ఏమిటి? చట్టపరమైన, న్యాయపరమైన అవరోధాలు ఏమీ లేవు. పులులు తదితర జంతువుల లెక్కలు ఉన్నాయి. కానీ బిసి జనాభా లెక్కలు చేయాలంటే అనేక అభ్యంతరాలు చెబుతున్నారు. ఈ వైఖరి మార్చుకోకపోతే బీసీలు తిరగబడతారని హెచ్చరించారు. సుప్రీం కోడ్డు- హై కోర్టు బి.సి. జనాభా లెక్కలు సేకరించాలని 40 సం.రాలుగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాయి. కానీ కేంద్ర పురుత్వం బి.సి జనాభా లెక్కలు తీయకుండా బికించి అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.ఈ సదస్సులో బిసి అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఎం.ఆనంద్ రావు,ఏ.పవన్ కుమార్ యాదవ్, బి. ఓం ప్రకాశ్ యాదవ్,జ్ఞానేశ్వర్ యాదవ్,ఎం.అశోక్ ముదిరాజ్, బి. శైలజ,దీ.శివ కృష్ణ,రావుల రాజు తో పాటు, హైకోర్టు అడ్వకేట్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న చిన్నవంగర ఆర్ఎంపి..... కూతటి రమేష్

-వైద్య వృత్తి అనేది,ప్రజలకు అందించే గొప్ప సేవ......
-నాయకులు జలగం శేఖర్




మహబూబాబాద్, నవంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన కూతాటి రమేష్ (ఆర్.ఎం.పి) గత కొద్ది సంవత్సరాలుగా వైద్యవృత్తిని ఎంచుకొని ప్రజలకు అత్యున్నత సేవనందిస్తున్నారు. ప్రజలు ఏ ఆపదలో ఉన్న తనకు సాధ్యమైనంత వరకు వైద్యాన్ని అందించి, ప్రజలకు సేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు .ఇటీవల కొంతకాలంగా కంటి చూపును కోల్పోయి బాధపడుతున్నటువంటి 20 మంది కంటి చూపుకు సంబంధించినటువంటి వ్యాధితో బాధపడుతుండగా అందరిని ఒక దగ్గర చేర్చి వారికి నాణ్యమైన చికిత్స అందించాలని తలచిన తను ఏదోరకంగా కంటి చూపును అందించాలని తలిచాడు. దానికి వాళ్ల ఆర్థిక స్తోమత సరిపోకపోవడంతో వినూత్నంగా ఆలోచించి ఉచితంగా వైద్యాన్ని అందించాలని తలచి హైదరాబాదులో ఉన్నటువంటి కార్పొరేట్ స్థాయి హాస్పిటల్ ఎమ్మెస్ రెడ్డి లయన్ నేత్ర వైద్య హాస్పిటల్ లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నారు అని తెలిసి వారికి ఏ విధంగానైనా సహాయం చేయాలని ఒకేసారి 20 మందిని హాస్పిటల్ కి చేర్చారు. అదేవిధంగా వరుసగా మూడు రోజుల వైద్యానికి గాను అక్కడే వారితో ఉండి దగ్గరుండి కంటి ఆపరేషన్లు విజయవంతంగా చేయించారు. అదేవిధంగా వారికి కావలసినటువంటి అన్ని సౌకర్యాలను దగ్గరుండి చూసుకున్నారు. ఈ అద్భుతమైన సేవకి చిన్నవంగర గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ,యూత్ మరియు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

# నానక్‌రామ్‌గూడలో విషాదం.. ఈతకు వెళ్లి ముగ్గురుబాలురు దుర్మరణం

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నగరంలోని నానక్‌రామ్‌గూడలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. ఈతకు వెళ్లి ముగ్గురుబాలురు దుర్మరణం చెందారు. గోల్ఫ్‌కోర్స్ చెరువు వద్ద ప్రమాదం చోటు చేసుకున్నది. మృతులను గచ్చిబౌలిలోని టెలికాంనగర్‌కు చెందిన షాబాజ్ (15), దీపక్ (12), పవన్ (13)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో టెలికాంనగర్‌కు చెందిన సుమారు తొమ్మిది మంది పిల్లలు ఆడుకుంటూ ఈత కొట్టేందుకు గోల్ఫ్‌కోర్స్ చెరువు వద్దకు చేరుకున్నారు.వీరంతా ఒకే పాఠశాలలో చదువుకోవడంతో పాటు ఒకే ఏరియాలో నివాసం ఉంటున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉన్నా.. కింద నుంచి వెళ్లారు. లోతు ఎక్కువగా ఉందని భయపడి ఆరుగురు విద్యార్థులు వెనక్కి వచ్చారు. మరో ముగ్గురు విద్యార్థులు నీటిలో దిగి ఈతకొట్టేందుకు ప్రయత్నించగా.. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయారు. మిగతా ఆరుగురు రోడ్డుపైకి వచ్చి ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు విషయాన్ని తెలుపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకునే లోపే విద్యార్థులు నీటిలో మునిగిపోయారు.ఆ తర్వాత స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికి తీసినట్లు పోలీసులు తెలిపారు. లోతు ఎక్కువగా ఉందని చెప్పినా వినకుండా ముగ్గురు ఈతకు వెళ్లారని, వెనక్కి రావాలని చెప్పినా వినలేదని మిగతా ఆరుగురు పిల్లల్లోని ఓ బాలుడు తెలిపాడు. నీటిలో మునిగిపోతుండగా.. రోడ్డుపైకి వెళ్లి ఓ ఆటోడ్రైవర్‌ను పిలిచి సహాయం చేయాలని కోరినా.. ఆ పని కాదంటూ వెళ్లిపోయాడని, మరో వ్యక్తి వచ్చి నీటిలో వెతికినా లాభం లేకపోయిందని ఆ బాలుడు తెలిపాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించినట్లు సదరు బాలుడు వివరించాడు.

# కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు వైద్యం : మంత్రి గంగుల

కరీంనగర్, నవంబర్ 19: కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఝూవేరియా, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి స్కానింగ్ మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ల పనితీరును అడిగి తెలుసుకొని, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రిలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో తీసుకుంటున్న చర్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు సూచనలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరిస్తూ నిరుపదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని భావించిన సీఎం కేసీఆర్.. ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అత్యాధునిక మిషనరీలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు వైద్యం అందించేందుకు గొప్ప సంస్కరణలు చేపట్టామన్నారు. కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో మరో కొత్త పరీక్ష అందుబాటులోకి వచ్చిందని, ప్రైవేటులో రూ.3వేల నుంచి ఆ పై విలువజేసే స్కానింగ్ సెంటర్‌ను కరీంనగర్ మాతా శిసు సంరక్షణ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చేసిందని వివరించారు.



# గ్రామసభలు సోమవారం నుండి ప్రారంభించాలి

ఖమ్మం, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): పోడు భూముల హక్కు పత్రాల విషయమై గ్రామ సభలు సోమవారం నుండి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపిడివో లు, రెవిన్యూ, అటవీ అధికారులతో పోడు భూముల గ్రామ సభల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించడంపై అధికారులను అభినందించారు. జిల్లాలో 94 గ్రామ పంచాయతీల్లోని 132 ఆవాసాల్లో హక్కుల కోసం 18295 దరఖాస్తులు వచ్చినట్లు, శనివారం మధ్యాహ్నం లోగా 17616 దరఖాస్తులు పరిశీలన పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. మిగులు దరఖాస్తుల పరిశీలన ఆదివారం లోగా పూర్తి చేయాలన్నారు. గ్రామ సభల నిర్వహణ సోమవారం నుండి ప్రారంభించాలని ఆయన తెలిపారు. సోమవారం మొదటి రోజున ఒక్కో ఆవాసం నుండి ఒక్కో గ్రామ సభ నిర్వహించాలని, ఎక్కడ నిర్వహించేది ఆవాసం పేరు, ప్రదేశం ముందస్తుగా టాం టాం ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గ్రామ సభ షెడ్యూల్ విషయమై సంబంధిత ఎస్ హెచ్ఓ కి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ సభ ఎక్కడి నుండైతే దరఖాస్తులు వచ్చాయో, ఎఫ్ఆర్సి ఏ ఆవాసంలో ఉందో ఖచ్చితంగా అక్కడే నిర్వహించాలన్నారు. గ్రామ సభకు ఆయా ఆవాసంలో ఉన్న ఓటర్లందరూ సభ్యులేనని ఆయన తెలిపారు. కోరం ఉంటేనే గ్రామ సభ నిర్వహించాలన్నారు. రికార్డులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామ సభ తీర్మానం చెల్లుబాటు అవుతుందన్నారు. తిరస్కరణకు కారణాలు నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క అర్హులైన దరఖాస్తుకు అన్యాయం జరగొద్దని, అన్ని అర్హులైన దరఖాస్తులను కవర్ చేయాలని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో భద్రాచలం ఐటిడిఏ పీవో గౌతమ్ పోట్రూ, అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, పోడు భూముల ప్రక్రియ మండల ప్రత్యేక అధికారులు అప్పారావు, సత్యనారాయణ, కృష్ణా నాయక్, శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కూతురితో కలిసి మిస్సైల్ టెస్టును వీక్షించిన కిమ్

న్యూఢిల్లీ, నవంబర్ 19:ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తెతో కలిసి మిస్సైల్ టెస్టును వీక్షించారు. ఆ ఫోటోలను కిమ్ విడుదల చేశారు. అయితే కిమ్‌కు ఎంత మంది పిల్లలు అనే విషయం ఇప్పటికీ తెలియదు. కిమ్ తన కుమార్తెను బయటకు తీసుకురావడం ఇదే మొదటిసారి. కిమ్‌కు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి అని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో జరిగిన ఓ వేడుకలో కిమ్ తన పిల్లలో కనిపించినట్లు స్థానిక మీడియా తెలిపింది.

ఈ నెల 3న ఏకంగా ఖండాతర క్షిపణిని (ఎఆఃఓ) పరీక్షించిన ఉత్తర కొరియా? తాజాగా శుక్రవారం మరోసారి ఐసీబీఎంని పరీక్షించిందని దక్షిణ కొరియా సైన్యం ధ్రువీకరించింది. ఉత్తర కొరియా అనుమాస్పద ఖండాంతర క్షిపణిని పరీక్షించిందని సియోల్ సైన్యం వెల్లడించింది. ఇది ప్యాంగాంగ్ రూపొందించిన దీర్ఘ శ్రేణి ఆయుధమని, అణ్వాయుధాలను కూడా మోసుకెళ్లగలుగుతుందని చెప్పింది. దీనితో అమెరికాలోని ఏ లక్ష్యాన్నైనా ఛేదించవచ్చని పేర్కొంది. కాగా, ఈ ప్రయోగంతో ఉత్తర కొరియా ఈ ఏడాది ఎనిమిది ఐసీబీఎంలను పరీక్షించినట్లయింది.

ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణి పరీక్షతో జపాన్ ఆందోళన వ్యక్తం చేసింది. దేశానికి చెందిన హ్కాక్కైడో రీజియన్‌లోని ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ (ఇఇజి) సముద్ర జలాల్లో క్షిపణి పడిందని జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా చెప్పారు. ఉత్తర కొరియా చర్య ఎట్టిపరిస్థితుల్లో ఆమోదయోగ్యం కాదన్నారు.

# ఒత్తిడి, అలసటతో డయాబెటిస్ బర్నవుట్ ముప్పు

న్యూఢిల్లీ, నవంబర్ 19: మధుమేహ బాధితులు వ్యాధి నియంత్రణలో ఉంచుకోవడం ఏమంత సులభం కాదు. సమతులాహారం, మెరుగైన జీవనశైలి, మందులతో మధుమేహాన్ని సమర్ధంగా నియంత్రించేందుకు శ్రమిస్తుంటారు. అయితే నిరంతరం ఒత్తిడికి లోనవడం, అలసట డయాబెటిక్ బర్నవుట్‌కు దారితీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ బర్నవుట్‌తో బాధపడే వారు మధుమేహాన్ని సమర్ధంగా నిర్వహించడంలో అలిసిపోతుంటారని డయాబెటిస్ కేర్ నిపుణులు అండ్రియా న్యుకమ్ చెబుతున్నారు.

డయాబెటిస్ బర్నింగ్ అనే పదానికి సరైన నిర్వచనం లేదని అమెరికన్ జర్నల్ ఆఫ్ నర్సింగ్ పేర్కొంది. అయితే దీని బారినపడిన వారిలో కుంగుబాటు భావన, డయాబెటిస్ కంట్రోల్‌కు చేపట్టాల్సిన చర్యలు, నిర్వహణలో అలిసిపోతారని వివరించింది. డయాబెటిస్ బర్నవుట్ శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపడమే కాకుండా మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహ రోగుల్లో 30 శాతం మంది డయాబెటిస్ బర్నవుట్ బారిన పడుతుంటారని నిపుణులు పేర్కొంటున్నారు. డయాబెటిస్ బర్నవుట్‌ను అధిగమించేందుకు ముందుగా ఆ పరిస్థితిని అంగీకరించి సానుకూల దృక్పదంతో ముందుకు సాగాలని చెబుతున్నారు. తమ సమస్యను వైద్యులతో చర్చించి చక్కదిద్దుకునే దిశగా ప్రయత్నాలు చేపట్టాలి. మధుమేహ నియంత్రణ దీర్ఘకాలం నిర్వహించాల్సిన క్రమంలో ఆరోగ్యంపై బాధితులు దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక రోజంతా ఉత్సాహంగా ఉండేలా చూసుకోవడం ద్వారా ఒత్తిడిని చిత్తు చేసి ఉత్తేజంగా గడపవచ్చు.


ఆహ్వానము

సౌమిత్రి పబ్లికేషన్స్, సికింద్రాబాద్
తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక సంస్థ
సౌజన్యంతో నిర్వహించు

నానమ్మ చెప్పిన కథలు (బాలల కథలు)
(కూరచిదంబరం)



పుస్తకావిష్కరణ

తేదీ : 26 నవంబర్ 2022, సా॥ 6:00గం॥లకు
రవీంద్ర భారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), సైఫాబాద్, హైదరాబాద్.

ముఖ్య అతిథి ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్.(రి) తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు.
విశిష్ట అతిథి : శ్రీ జూలూరు గౌరీశంకర్ గారు, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు, జాతీయ పుస్తక ప్రదర్శన కేంద్రం.
సభాధ్యక్షులు : శ్రీ విహారి గారు, ప్రముఖ కవి, సాహితీవేత్త, సమీక్షకులు
గౌరవ అతిథి : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ
ఆత్మీయ అతిథులు : డా॥ పత్తిపాక మోహన్, సంపాదకులు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా
శ్రీ చొక్కాపు వెంకటరమణ గారు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, అధ్యక్షులు, బాలసాహిత్య పరిషత్.
శ్రీ తంగిరాల చక్రవర్తి గారు, కవి సాహితీ వేత్త

సౌమిత్రి పబ్లికేషన్స్, సికింద్రాబాద్
అందరూ ఆహ్వానితులే.....


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే దేవాలయాలని, వాటిని సద్వినియోగం చేసుకున్నప్పుడు విద్యార్థులు అన్ని రంగాలలో రాణించగలరని రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరు శంకరయ్య అన్నారు. స్థానిక అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నవంబర్ 14 నుంచి 19 వరకు) నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలలోని పుస్తకాలలో వివిధ రచయితలు, కవులు మరియు ఎందరో మహానుభావులు తమ జీవిత కాలంలో సంపాదించిన విజ్ఞానం నిక్షిప్తమై ఉంటుందని, విద్యార్థులు వాటిని చదవడం ద్వారానే వారికి సరైన గౌరవం ఇచ్చినట్లు అన్ని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో పాటు మహానుభావుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాసం తదితర విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాల అలవాటు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులలో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసం పెంపొందడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించేలా మరియు వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేలా విద్యార్థులకు వ్యాసరచన, పుస్తక సమీక్ష, ఉపన్యాసం, క్విజ్, పుస్తక ప్రదర్శనలు, జాతీయ అంతర్జాల సదస్సు తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయం చైర్మన్ ఆకునూరు శంకరయ్య బహుమతులను ప్రధానం చేశారు. తదనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్, గ్రంథాలయాధికారి, అధ్యాపకులు మరియు విద్యార్థులు శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి కోఆర్డినేటర్ మరియు గ్రంథాలయాధికారి డాక్టర్ వి. వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ మధు రాజేష్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ అప్సారీ ఉస్మాని, డాక్టర్ మల్లారెడ్డి, రాజేశ్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీనివాసులు, నారాయణ, నరసయ్య, కరుణ, మధుబాబు, దీపిక, అర్జున్, రమేశ్ బాబు, ఫకీర్ బాబా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

హైదరాబాద్, నవంబర్ 19: సీఎం కేసీఆర్ మరో అంబేద్కర్ అని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన రెండో విడత దళిత బంధు లబ్ధిదారులతో వెస్ట్ శ్రీనివాస్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో మరెక్కడా లేవని..ఆ ఖ్యాతి కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని అన్నారు. సమ సమాజ స్థాపన కోసం కేసీఆర్ పాటుపడ్తున్నారని..ఆనాడు అంబేద్కర్ దళితుల కోసం పనిచేశారని..అదే బాటలో కేసీఆర్ నడుస్తున్నారని పేర్కొన్నారు.

ఆర్థికంగా దళితులు నిలదొక్కుకునేందుకు దళితబంధును ప్రభుత్వం ప్రవేశం పెట్టిందని ..జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంకా పథకాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కులమతాలకతీతంగా తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తమకు దళిత బంధు పథకం ద్వారా జీవనోపాధిని కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య విజయ్, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కోనేరు అజయ్, ప్రధాన కార్యదర్శి వేణు, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేశ్,నాయకులు వేణుగోపాల్ యాదవ్, విజయ్ ముదిరాజ్, , గజ్జల బాలకృష్ణ పవన్,సత్యనారాయణ, నర్సింగ్‌రావు, కిట్టు, అఫ్సర్, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం..

ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ డివిజన్ లో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వావలంబన కోసం..వారి సాధికారత కోసం ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. డివిజన్‌కు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.1,701లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజకుమార్ పటేల్, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై సమీక్ష

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వహాబ్, మేనేజర్లు రాజేందర్, రమేశ్, శ్రీనివాస్‌తో పాటు కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, మన్నె కవితారెడ్డిలతో ఆయా డివిజన్లలో పెండింగ్ పనులను గురించి ఆరా తీశారు. మురుగు సమస్యల పరిష్కారానికి మంజూరైన సీవరేజీలైన్ పనులను వేగంగా పూర్తిచేయాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మాగంటి ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకులు సంజీవ్, సంతోష్, మన్సూర్, కృష్ణమోహన్, విజయ్‌కుమార్, విజయసింహ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లకై 24న పార్లమెంట్ ముట్టడి

### -జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, నవంబర్ 19: కేంద్రంలో 27 శాతం నుంచి 50శాతం పెంచాలని, చట్టసభలలో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని అలాగే బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసి పార్లమెంట్ వద్ద భారీ ధర్నా, పార్లమెంటు ముట్టడి ఏర్పాటు చేసినట్లు ? రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ అంధోళన కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద యెత్తున పోల్గొంటారని తెలిపారు. శనివారం బిసి రిజర్వేషన్స్ పై బిసి సంఘాల కోర్ కమిటి సమావేశం గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ రిజర్వేషన్లపై విధించిన గరిష్ట పరిమితి 50 శాతంనూ సుప్రీం కోర్టు తొలగించినందున ఎలాంటి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు లేనందున బిసి/ ఎస్సీ/ ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేస్తున్నాం. ఇటీవల ఇచిా రిజర్వేషన్లు చెల్లుతాయని, 50% గరిష్ట పరిమితి కూడా సరికాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అలాగే 103వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ 50



శాతం గరిష్ట పరిమితి తొలగించి ఇచిా ? లకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది.

దీనితో రిజర్వేషన్లపై ఉన్న గరిష్ట పరిమితి తొలగిపోయింది. రిజర్వేషన్లపై న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగపరంగా యున్న అవరోధాలు తొలగిపోయాయి. కావున వెంటనే బీసీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం కేంద్రంలో 27 శాతం నుంచి 50 శాతం పెంచాలని కోరారు. పెంచడానికి కేంద్ర ప్రభుత్వానికి ఏలాంటి అడ్డంకులు లేవన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. గతంలో వైఎస్ఆర్? కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల క్రితం పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టారు. బి.సి బిల్లు కు మద్దతుగా 14 పార్టీలు మద్దతు ఇచ్చారు. టి.ఆర్.ఎస్. టి.డి.పి. డి.ఎం.కె, అన్నా డి.ఎం.డి. పి.ఎం.క, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, బిఎస్పి, జనతాదళ్ (యునైటెడ్), జనతా దళ్ (అ), కాంగ్రెస్ పార్టీ, నేషన్ లిష్టు కాంగ్రెస్ పార్టీ, ఆప్నా దళ్, లోక్ దళ్ పార్టీలు బిల్లుకు మద్దతు ఇచ్చారు. బిజెపి పార్టీ మద్దతు ఇవ్వకపోవడంతో బిల్లు పాస్ కాలేదు. బిజెపి పార్టీ మద్దతు ఇస్తే బిల్లు ఒక్కరోజులోనే బిల్లు పాస్ అవుతుంది. అన్ని పార్టీలు కూడా "బీజేపీని ఒప్పించండి మేము మద్దతిస్తా" మంటున్నాయి. కానీ బిజెపి పార్టీ బీసీల పట్ల తమ విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేయాలని కోరారు. . ప్రధానమంత్రి శ్రీ నరేంద్రవెూడీ బీసీ వర్గానికి చెందినవారు. బీసీలంతా నరేంద్ర మోడీ పై ఆశలు పెట్టుకున్నారు. నరేంద్ర మోడీ హయాంలో బీసీ లో బిల్లు పెట్టకపోతే చరిత్ర కమించదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏ. వర ప్రసాద్, లాల్ కృష్ణ , సి. రాజేందర్, నీల వెంకటేష్,రాజ్ కుమార్ ,జి. అనంతయ్య,రావుల రాజు తదితరులు ప్రసంగించారు.

# 80 ముక్కలుగా వ్యక్తి అస్థిపంజరం.. హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులు

భోపాల్:, నవంబర్ 19:అటవీ ప్రాంతంలో 80 ముక్కలుగా వ్యక్తి అస్థిపంజరం లభించింది. తొమ్మిది నెలలపాటు దర్యాప్తు చేసిన పోలీసులు చివరకు హత్య మిస్టరీని ఛేదించారు.

ఒక నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చుయియా గ్రామానికి చెందిన 21 ఏళ్ల వికాస్ గిరి, 2021 అక్టోబర్‌లో అదృశ్యమయ్యాడు. దీంతో ఆ యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో దుధ్మనియా అడవి ప్రాంతంలో పశువులు మేపే కొందరు అక్కడ ఒక అస్థిపంజరం, ఆధార్ కార్డును గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి 80 ముక్కలున్న అస్థిపంజరాన్ని వెలికితీశారు. మృతుడు వికాస్ గిరిగా గుర్తించారు. అనంతరం ఆ యువకుడి హత్యపై దర్యాప్తు చేశారు.

కాగా, గ్రామానికి చెందిన 31 ఏళ్ల యూనస్ అన్సారీ సోదరి, వికాస్ గిరి కలిసి ఉండగా తాము చూసినట్లు పోలీసులకు గ్రామస్తులు తెలిపారు. దీంతో అన్సారీని చాలాసార్లు ప్రశ్నించగా తనకేమీ తెలియదని అన్నాడు. అయితే మరికొన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు ఈ నెల 4న అన్సారీని అదుపులోకి తీసుకుని క్రాస్‌ఎగ్జామ్ చేశారు. దీంతో హత్య గుట్టు విప్పాడు. తన సోదరిని గిరి వేధిస్తున్నాడని, తమ ఇంటి వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపాడు. రాడ్‌తో కొట్టగా అతడు చనిపోయినట్లు చెప్పాడు. అనంతరం మృతదేహాన్ని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ పాతిపెట్టినట్లు వెల్లడించాడు.

ఈ నేపథ్యంలో అన్సారీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడైన అతడి బంధువు సిర్తాజ్ మహ్మద్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మృతుడు వికాస్ గిరి, అన్సారీ మధ్య వ్యాపార లావాదేవీలు ఉన్నాయని, ఈ క్రమంలో అన్సారీ సోదరితో అతడికి పరిచయం ఏర్పడిందని పోలీసులు వెల్లడించారు.

# ఉపాధి హామీ పథకం కూలిలకు వేతనాలు విడుదల చేయండి

### -కేంద్ర పంచాయతీరాజ్ మంత్రికి ఎర్రబెల్లి లేఖ

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు కేంద్రం రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం పట్ల రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ, పక్షపాత ధోరణి కనబరుస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం కింద దాదాపు లక్షా 25వేల మంది కూలీలకు రెండు నెలల వేతనాలు రూ. 110.35లక్షలు విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రికి లేఖ రాశారు. వెంటనే నిధులు విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని కోరారు.

# 1095 కనెక్షన్లు.. రూ.8.31 కోట్ల బకాయిలు



హైదరాబాద్, నవంబర్ 19: జలమండలి వాణిజ్య(కమర్షియల్) నల్లా కనెక్షన్ల బకాయిల విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఆరు నెలలు, ఆపై నుంచి నల్లా బిల్లు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల బకాయిలను వసూలు చేయాలని, చెల్లించకపోతే కనెక్షన్లను తొలగించాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులకు సూచించారు. ఇందుకుగాను రెవెన్యూ వసూలు బృందాలకు సహాయకంగా జలమండలి విజిలెన్స్ విభాగాన్ని సైతం రంగంలోకి దింపుతున్నట్లు పేరొన్నారు. గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ, సింగిల్ విండో సెల్ , తదితర అంశాలపై ఆయన అధికారులతో విస్తృ?తత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ దానకిశోర్ మాట్లాడుతూ ఆరు నెలలు, అంతకంటే ఎకువ రోజుల నుంచి బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల వినియోగదారులు మొత్తం1095 ఉన్నట్లు గుర్తించారు. వీరినుంచి రూ.8.31 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఆరు నెలలు, ఆపై బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల బకాయిల విషయంలో కఠినంగా ఉండాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.

నాన్ ఫ్రీ వాటర్ సీమ్(నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకానికి దరఖాస్తు చేసుకోని)పరిధిలో ఉన్న కనెక్షన్ల బకాయిలపైన కూడా దృష్టి సారించాలని, ఈ బకాయిలను సైతం వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే వీరికి 13 నెలల బిల్లులను ప్రభుత్వం రద్దు చేసిందని, ఉచిత తాగునీటి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అనేక అవకాశాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. వీరు ఇప్పటికైనా ఉచిత తాగునీటి పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి నుంచి పథకం వర్తిస్తుందని, బకాయిలు మాత్రం చెల్లిస్తే సరిపోతుందని పేరొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఓఅండ్ఎం డైరెక్టర్ అజ్మీరా కృష్ణ , సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, పాల్గొన్నారు.

# హోరా హోరీగా జాతీయ స్థాయి కరాటే పోటీలు



కరీంనగర్, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): సి ఎస్ కే ఐ 2019 జాతీయ స్థాయి కరాటే పోటీలు రెండవ రోజున 14 పై క్యాటగిరి లో బాల , బాలికలు పాల్గొన్నారు . కటాస్ కుమిటే, క్యాటగిరిలలో 400 మంది క్రీడాకారులు పాల్గొనగా .తెలంగాణ 92. పతకలతో మొదటి స్థానంలో , 84 పతకలతో ఆంధ్రప్రదేశ్ . రెండవ స్థానంలో , 58 పతకలతో పశ్చిమ బెంగాల్ మూడోస్థాన స్థానంలో , 46 పతకాలతో తమిళనాడు నాలుగవ స్థానంలో నిలిచారు . రేపు 14 సంవత్సరాలలోపు కాటగిరిలో బాల , బాలలు తలపడనున్నారు . అలాగే 4 లక్షల క్యాష్ ఫ్రైడ్ ఓపెన్ చాలెంజ్ రసవత్తరంగా జరగనుంది . . విజేతలకు టీవీ 5 యేటివ్ హెడ్ ఉ. భవాని హాజీరై మోడల్స్ అందించారు . ఈ కార్యక్రమంలో ఛీఫ్ ఆర్గనైజర్ఈ. శ్రీనివాస్ , టోర్నమెంట్ ఇంచార్జ కూడుగుల ప్రవీణ్ , వసంత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శ నరేందర్ , రాష్ట్ర ఉపాధ్యర్జుడు గౌరు రాజిరెడ్డి, పెద్ది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం..



అమరావతి: నవంబర్ 19:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ పట్నంలోని స్టీల్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం జరిగింది. ఆర్ఎం హెచ్పీ డిపార్ట్ మెంట్ లో మంటలు చెలరేగాయి. కన్వేయర్ బెల్టులు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంటోంది. అగ్నిమాపక దళాలు అగ్నిమాపక యంత్రాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

